PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 250 | విజయవాడ, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | 6 + 8 + స్నేహ పేజీలు వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 13 April 2025 | Rs

సాగు భూములు కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదు

- స్థాపించిన పరిశ్రమలపై శ్వేత పత్రం విడుదల చేయాలి : వి శ్రీనివాసరావు

2

నేడు 30 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో క్రమేపీ ఎండల తీవ్రత పెరుగుతున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం 30 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 67 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లాలో 7, విజయనగరం జిల్లాలో 11, పార్వతీపురం మన్యం జిల్లాలో 10, ఏలూరు జిల్లా భీమడోలు, ఎన్‌టిఆర్ జిల్లా జి కొండూరు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, శ్రీకాకుళం జిల్లాలో 2, విజయనగరం జిల్లాలో 7, పార్వతీపురం మన్యం జిల్లాలో 2, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3, తూర్పుగోదావరి జిల్లాలో 1, పశ్చిమ గోదావరి జిల్లాలో 2, ఏలూరు జిల్లాలో 10, కృష్ణా జిల్లాలో 11, ఎన్‌టిఆర్ జిల్లాలో 5, గుంటూరు జిల్లాలో 16, బాపట్ల జిల్లాలో 5, పల్నాడు జిల్లాలో 3 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు.

'పాత' భారం భరించేదెలా!

- బిల్లుల బకాయిల మొత్తం రూ.లక్ష కోట్లకుపైనే
- కొత్త ఏడాదికి బదలాయింపుపై ఆందోళన
- ఆర్థికశాఖ మార్గదర్శకాలతో అయోమయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానాపై పాత బిల్లుల భారం ఆందోళన కలిగిస్తోంది. కొత్త బడ్జెట్‌లో పాత బకాయిలకు కేటాయింపులు లేకుండా చెల్లింపులు చేయాలంటే ఎలా అని శాఖాధిపతులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా అన్ని శాఖలకు ఆర్థికశాఖ జారీ చేసిన మార్గదర్శకాలు చూస్తే ఖజానాను ముందుకు తీసుకువెళ్లడం కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం శాఖల్లో ఇదే అంశంపై చర్చ జరుగుతోంది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన ఖర్చులపై ఇటీవల ఆర్థికశాఖ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అనేక బిల్లుల చెల్లింపులను నిలిపివేసి వాటిని కొత్త సంవత్సరానికి బదలాయించారు. దాదాపు లక్ష కోట్ల రూపాయలు వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆర్థికంగా అవకాశాలు లేకపోవడంతో వాటిని ఈ ఏడాదికి బదలాయించాలని నిర్ణయించారు. అయితే ఈ ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌లో పాత బకాయిల ఊసు లేకపోవడంతో వాటి చెల్లింపులు ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఈ ఏడాది చేయాల్సిన ఖర్చులకు సంబంధించే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేశారు. వాస్తవానికి ప్రతియేటా ఆమోదిస్తున్న బడ్జెట్‌లోనే అవసరాలకు సరిపడే వ్యయాన్ని చేయలేకపోతున్నారు. ఆదాయం చాలకపోవడం వల్లనే అంటూ అధికారులు కూడా చెప్పుకొస్తున్నారు. ఇప్పుడు పాత బిల్లులను కొత్త సంవత్సరంలోకి బదలాయించడం వల్ల వాటికి నిధులు ఎక్కడనుంచి వస్తాయన్నది అధికారుల అనుమానం. వాటిని ఈ ఏడాది నిధులు సమకూరిస్తే ఈ ఏడాది వచ్చే కొత్త బిల్లులకు నిధుల కొరత మళ్లీ ప్రారంభమవుతుందని వారంటున్నారు. ఇప్పటికే పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల ప్రభుత్వంపై ఒత్తిడి ఎక్కువవుతోంది.

బాలికలదే హవా

ఇంటర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసిన మంత్రి లోకేష్ • ఫస్ట్ ఇయర్‌లో 70 శాతం, సెకెండ్ ఇయర్‌లో 83 శాతం ఉత్తీర్ణత • ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు మెరుగు • ప్రథమ స్థానం సాధించిన కృష్ణా జిల్లా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బాలికలు హవా సాగించారు. ఈ మేరకు ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శనివారం ఉదయం 'ఎక్స్' వేదికగా ఫలితాలను ప్రకటించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,87,295 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 3,42,979 మంది (70 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 4,22,030 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 3,51,521 మంది (83 శాతం) ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 38,553 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 23,991 మంది (62 శాతం) ఉత్తీర్ణత సాధించగా, రెండో సంవత్సరంలో 33,289 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 25,707 మంది (77 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

బాలికలదే పైచేయి

ఇంటర్ పరీక్షల్లో బాలురు కంటే బాలికలే అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారు. జనరల్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 2,38,107 మంది బాలురు పరీక్ష రాస్తే 1,56,258 మంది (66 శాతం) ఉత్తీర్ణత సాధించగా, 2,49,188 మంది బాలికలు పరీక్ష రాయగా, 1,86,721 మంది (75 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 2,03,904 మంది బాలురు పరీక్షలు రాస్తే 1,62,952 మంది (80 శాతం) ఉత్తీర్ణులవగా, 2,18,126 మంది బాలికలు పరీక్ష రాయగా 1,88,569 మంది (86 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 15,968 మంది బాలురు పరీక్షలు రాస్తే 7,966 మంది (50 శాతం) ఉత్తీర్ణులవగా, 22,585 మంది బాలికలు పరీక్ష రాయగా 16,025 మంది (71 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 13,710 మంది బాలురు పరీక్ష రాస్తే 9,236 మంది (67 శాతం) ఉత్తీర్ణత సాధించగా, 19,579 మంది బాలికలు పరీక్షలు రాయగా 16,471 మంది (84 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు భేష్

- మంత్రి నారా లోకేష్

6

సుప్రీం తీర్పుతో 10 చట్టాలకు గెజిట్

- తమిళనాడు ప్రభుత్వ చారిత్రక నిర్ణయం

చెన్నై : తమిళనాడు ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఆత్మస్థైర్యంతో... గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం లేకుండానే పది చట్టాలను గెజిట్‌లో నోటిఫై చేసింది. ఇలా చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం తమిళనాడు ప్రభుత్వం శుక్రవారం ఈ చర్యలు చేపట్టింది. ఈ చట్టాలను గతంలో రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదం తెలపకపోవడంతో ప్రత్యేక సమావేశంలో వాటిని తిరిగి ఆమోదించారు. ఆ తరువాత రాష్ట్రపతికి గవర్నర్ పంపించారు. అసెంబ్లీ తిరిగి ఆమోదించిన బిల్లులను తప్పుగా రాష్ట్రపతికి పంపడంపై సుప్రీం విచారణ జరిపి, ఈ నెల 8న కీలక తీర్పు ఇచ్చింది. అసెంబ్లీ తిరిగి ఆమోదించిన బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన 2023 నవంబర్ 18న ఆ బిల్లులు ఆమోదం పొందినట్టుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన చట్టాల్లో... చాలా చట్టాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించినవి. సుప్రీంకోర్టు తీర్పుతో చట్టాలు ఆమోదం పొందడంతో సిఎం స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. గవర్నర్ / రాష్ట్రపతి సంతకం లేకుండా సుప్రీంకోర్టు తీర్పుతో అమలులోకి వచ్చిన మొదటి చట్టాలుగా చరిత్ర సృష్టించాయంటూ డిఎంకె రాజ్యసభ సభ్యులు పి. విల్సన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి సిఎం స్టాలిన్ స్పందిస్తూ... డిఎంకె అంటే చరిత్ర సృష్టించడం అని, ఇది అన్ని రాష్ట్రాల విజయం అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

ముర్షిదాబాద్‌లోని జంగీపూర్‌లో దగ్ధమైన వాహనాలు

వక్ఫ్ ఆందోళనలు హింసాత్మకం

- బెంగాల్లో ముగ్గురు మృతి
- ఆ చట్టాన్ని అమలుచేయం : మమతా బెనర్జీ
- శాంతిభద్రతలను కాపాడాలి : లెఫ్ట్‌ఫ్రంట్ డిమాండ్

5

అన్నవరం

వెంకటేశ్వరావు

శ్రీరాములు

విద్యుదాఘాతానికి ముగ్గురు కార్మికులు బలి

ప్రజాశక్తి- కోరుకొండ(తూర్పుగోదావరి జిల్లా)

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరం గ్రామంలోని సూర్య మహాలక్ష్మి ట్రేడర్స్ రైస్ మిల్లులో విద్యుదాఘాతానికి గురై ముగ్గురు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. తోటి కార్మికులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... కాపవరానికి చెందిన ఆకుల శ్రీరాములు (30), బలసాని అన్నవరం (45), జాజులు వెంకటేశ్వరరావు (55) స్థానికంగా ఉన్న సూర్య మహాలక్ష్మి ట్రేడర్స్ రైసు మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. శనివారం ధాన్యాన్ని హైడ్రాలిక్ కన్వేయర్ బెల్ట్ ద్వారా లోడ్ చేయడానికి అనువుగా కన్వేయర్ బెల్ట్‌ను మరో ముగ్గురు కార్మికులతో కలిసి మారుస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. బెల్టుకు సపోర్టుగా ఉండే ఇనుప కడ్డీలు పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లకు తగలడంతో, కార్మికులు విద్యుదాఘాతానికి గురయ్యారు. శ్రీరాములు, అన్నవరం, వెంకటేశ్వరరావు అక్కడిక్కడే మరణించారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ ఘటనా ప్రాంతానికి చేరుకొని బాధిత కుటుంబాలను ఓదార్చారు. కాగా మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున నష్టపరిహారం ఇచ్చేందుకు రైస్ మిల్లు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు.



మాట వినలేదని కుమార్తెను కడతేర్చిన తల్లి

- నిఖితది కులదురహంకార హత్యే : చంద్రగిరి డిఎస్‌పి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నర్సింగాపురంలో మృతి చెందిన బాలికది అనుమానాస్పద మృతి కాదని, తమ దర్యాప్తులో కులదురహంకార హత్యగా తేలిందని చంద్రగిరి డిఎస్‌పి ప్రసాదరావు, సిఐ సుబ్బరామిరెడ్డి చెప్పారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. నర్సింగాపురం గ్రామంలో నివసిస్తున్న బిసి సామాజిక తరగతికి చెందిన నిఖిత (16) తమ పక్క గ్రామమైన మిట్టపాలెం దళిత వాడకు చెందిన అజయ్‌తో ప్రేమలో పడి గర్భం దాల్చడంతో తల్లి సుజాత బలవంతంగా అబార్షన్ చేయించింది. అజయ్‌తో కలిసి తిరగకూడదని కుమార్తెను మందలించినా మాట వినకపోవడంతో అజయ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసి పోక్స్ కేసు పెట్టారు. ఈ కేసులో అజయ్ జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో అతనిని రెండుసార్లు కలిసిందని బాలిక తల్లి గ్రహించింది. దీంతో తన కుమార్తెను కడతెర్చేందుకు సిద్ధమైంది. కాళ్లుచేతులు కట్టేసి నోరు అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి నిఖితను మూడురోజుల క్రితం కడతేర్చింది. కుమార్తె విషయం ఎవ్వరికీ చెప్పకుండా బంధువుల సాయంతో ఖననం చేసింది. గ్రామస్తులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సింగాపురం గ్రామా రెవెన్యూ అధికారి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి తల్లిని విచారించగా.. తన మాటను ధిక్కరించినందుకే కుమార్తెను హత్య చేసినట్లు ఆమె ఒప్పుకున్నారు. సుజాతను పోలీసులు అరెస్టు చేశారు.

సాగు భూములు కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదు

స్థాపించిన పరిశ్రమలపై శ్వేతపత్రం విడుదల చేయాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కార్పొరేట్లకు వ్యవసాయ భూములు స్వాధీనపరచిన వైనంపై రాష్ట్ర ప్రభుత్వం నిగ్గుతేల్చాలని, ఈ 25 ఏళ్ల కాలంలో ఎన్ని పరిశ్రమలు స్థాపించారు? ఎంత మంది ఉద్యోగాలు పొందారు? ఎంతమంది స్థానికులకు ఉద్యోగాలు దక్కాయో ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని సుందరయ్య భవనంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 25 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు సాగు భూములను రైతుల నుంచి బలవంతంగా లాగేసుకొని పారిశ్రామిక అభివృద్ధి పేరుతో సుమారు 1.48 లక్షల ఎకరాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా బదలాయించినట్లు తెలిపారు. సెజ్, పారిశ్రామిక కారిడార్, ఎపిఐఐసి పేరుతో రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న భూముల్లో కనీసం 20 శాతం కూడా పరిశ్రమలు స్థాపించలేదన్నారు. పరిశ్రమల పేరుతో కొందరు బ్యాంకు రుణాలు తీసుకుని ఎగవేయగా, మరికొందరు ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని వివరించారు. రాజకీయ నేతలే కంపెనీలకు బినామీలుగా వ్యవహరిస్తూ లబ్ధిపొందుతున్నారని తెలిపారు. నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో 6,500 ఎకరాలను సేకరించి మూడు వేల ఎకరాలను మిట్టల్ కంపెనీకి కేటాయించడం ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం నమ్మబలుకుతోందన్నారు. ఈ చర్యతో 30 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను మూత వేయడానికి ప్రభుత్వం ఎత్తుగడ వేస్తోందని విమర్శించారు. అదేవిధంగా వాన్‌పిక్, లేపాక్షి, కాకినాడ పారిశ్రామికవాడ పేరుతో సేకరించిన వేలాది ఎకరాల భూములలో ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదన్నారు. ప్రకాశం జిల్లాలో 'నిమ్జ్' పేరుతో 14 సంవత్సరాల క్రితం 20 వేల ఎకరాలు సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఒక్క కంపెనీని గానీ, ఒకరికి ఉద్యోగంగానీ కల్పించిన దాఖలాలు లేవని తెలిపారు. తాజాగా రిలయన్స్ కంపెనీ బయోగ్యాస్ ప్లాంట్ పేరుతో వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం నమ్మబలుకుతోందని, వాస్తవంగా 160 మందికి మాత్రమే ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. భవిష్యత్తులో కంపెనీలకు భూ కేటాయింపులపై సమగ్ర చట్టం తేవాలని, దీనికి కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా కేంద్రంలో 110 ఎకరాల ఒంగోలు డెయిరీ టిడిపి వల్ల మూతపడిందన్నారు. మార్కాపురం 'పలకల పరిశ్రమ'పై 25 శాతం జిఎస్‌టి విధించడం వల్ల ఆ పరిశ్రమ దివాళా తీసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల జిల్లాలో గ్రోత్ సెంటర్‌లోని కంపెనీలు 50 శాతం మూతపడ్డాయని, చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో నెట్టబడిందని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'పి-4' పేరుతో కార్పొరేట్ కంపెనీలు గ్రామాలను దత్తత తీసుకోవడం ద్వారా పేదరిక నిర్మూలన సాధిస్తామని ప్రజలను మభ్యపెట్టే చర్యలు మానుకొని తక్షణమే అభివృద్ధిపై దృష్టి సారించాలని, అందుకు అవసరమైన నిధులను రాబట్టేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. వేల కోట్ల రూపాయలు రాయితీ పొందుతూ, వేలాది ఎకరాలను అప్పనంగా పొందిన కార్పొరేట్ కంపెనీల సంపద, ఆస్తులపై పన్నులు వసూలు చేసి అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీల 'సిఎస్‌ఆర్' నిధి రెండు శాతం ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని, దీంతో రాష్ట్రంలో అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. అంతకు ముందు మార్క్సిస్టు యోధులు మాకినేని బసవపున్నయ్య 33వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు, కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జివి.కొండారెడ్డి పాల్గొన్నారు.

మాకినేని బసవపున్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తదితరులు

మాకినేని బసవ పున్నయ్య వర్థంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న పి మధు

ఎంబి ఆశయ సాధనకు కృషి

- సిపిఎం నేతలు మధు, వైవి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కామ్రేడ్ మాకినేని బసవ పున్నయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎంబివికె మేనేజింగ్ ట్రస్టీ పి మధు, ఎంబివికె ట్రస్ట్ కార్యదర్శి వై వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మాకినేని బసవ పున్నయ్య 33వ వర్ధంతిని విజయవాడలోని ఎంబివికెలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధు, వైవి మాట్లాడుతూ.. బసవ పున్నయ్య ప్రముఖ ప్రజ్ఞాశీలి అని పేర్కొన్నారు. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాలను అధ్యయనం చేసి, సమాజానికి అన్వయించి, ప్రజలను భాగస్వాములు చేశారన్నారు. ఆయన ధనిక, భూస్వాముల కుటుంబంలో పుట్టినప్పటికీ ఆస్తులను ప్రజా జీవితానికి అంకితం చేశారన్నారు. గుంటూరు బాపనయ్య కృష్ణా నది దాటేందుకు పడవ ఎక్కినప్పుడు అగ్రవర్ణాలు అడ్డుకున్న సమయంలో ఆయన బాపనయ్యకు అండగా నిలిచారన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందుకు వెళ్తున్నామని చెప్పుకుంటున్న నేటి రోజుల్లో కూడా కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ, కార్మిక, కర్షక, వర్గాలకు అండగా పోరాటాలు చేసేందుకు ఉద్యమాలు నడపాలని మాకినేని బసవ పున్నయ్య పునాది వేశారన్నారు. ప్రపంచ అతి తక్కువ మంది మార్క్సిజం మేధావుల్లో అగ్రగణ్యుడన్నారు. రకారకాల పండగలు, సాహిత్య కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేశారన్నారు. జిల్లాల్లో స్థానికంగా ఉన్న నాయకులు పేరుతో విజ్ఞాన కేంద్రాలు నడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామరాజు, హరికిశోర్ పాల్గొన్నారు.

వైసిపి పిఎసి స్టేట్ కో-ఆర్డినేటర్‌గా సజ్జల

- 33 మందితో సభ్యుల ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ స్టేట్ కో-ఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డిని పార్టీ నియమించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు కమిటీ సభ్యుల పేర్లను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసింది. పిఎసి సభ్యులుగా తమ్మినేని సీతారాం, పీడిక రాజన్నదొర, బెల్లాన చంద్రశేఖర్, గొల్ల బాబురావు, బూడి ముత్యాలనాయుడు, పిల్లి సుభాష్ చంద్రబోస్, పినిపే విశ్వరూప్, తోట త్రిమూర్తులు, ముద్రగడ పద్మనాభం, పుష్పాల శ్రీనివాసరావు, చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, కొడాలి నాని, వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, కోన రఘుపతి, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, నందిగం సురేష్, ఆదిమూలపు సురేష్, పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, కళత్తూరు నారాయణ స్వామి, ఆర్‌కె రోజా, వైఎస్ అవినాష్ రెడ్డి, షేక్ బెపారి అంజాద్ బాషా, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అబ్దుల్ హఫీజ్ ఖాన్, మాలగుండ్ల శంకరనారాయణ, తలారి రంగయ్య, వై విశ్వేశ్వర రెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, సాకే శైలజానాథ్ ఉన్నారు. పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు పిఎసి శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు.

మల్టీ డిప్లనరీ కమిటీ రిపోర్ట్‌కు నిరసనగా లోకోల నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మల్టీ డిప్లనరీ కమిటీ రిపోర్ట్‌కు నిరసనగా విజయవాడ క్రూలాబీ వద్ద శనివారం ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ నేతృత్వంలో లోకో పైలెట్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకో పైలెట్ల నేతలు మాట్లాడుతూ.. డ్యూటీ అవర్స్‌ను గూడ్స్‌లో 8 గంటలకు, కోచింగ్‌లో 6 గంటలకు పరిమితం చేయాలని, నిరంతరం రాత్రి డ్యూటీలను రెండు రాత్రులకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్ 30 నుంచి 40 గంటలకు పెంచడం, 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రైళ్లకు ట్రిప్ అలవెన్స్, కో పైలెట్లను అందించడం, ఎంఇఎంఇ/డిఇఎంఇలకు సహాయక ఎఎల్‌పిని అందించాలన్నారు. భోజనం, నేచర్‌కాల్ కార్యాలకు విరామ ఏర్పాట్లు కల్పించడం, లోకోల్లో సిసివిఆర్‌ఎస్ కెమెరాల ఏర్పాటును వ్యతిరేకించాలని ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ పిలుపునిచ్చింది. ఎఫ్‌ఎస్‌డి భారం నుంచి ఎఎల్‌పికి విముక్తి కల్పించడం, 36 గంటల్లో రిటర్న్ టు హెడ్ క్వార్టర్స్, ప్రమోషన్లలో ఆప్టిట్యూడ్/సైకలాజికల్ పరీక్షలను తప్పనిసరి చేయడాన్ని వ్యతిరేకించాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ ఎం వెంకటేశన్, డివిజన్ సెక్రటరీ ఆర్‌వి రాము, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె రామకృష్ణ, బ్రాంచ్ సెక్రటరీ కె రాజేష్, బ్రాంచ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ శివకుమార్, బ్రాంచ్ సెక్రటరీ జి గౌరీశంకర్ ప్రసంగించారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

- పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించడమేకాక లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో రక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు రామచంద్రరావు, శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1521వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ... స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. కార్మికులను తొలగించరాదని, నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సుదీర్ఘ కాలంగా సాగుతున్న ఉక్కు పోరాటం కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాట్ ఫలితాలు విడుదల

- ఏప్రిల్ 16 నుంచి మొదటి విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీ వద్దనున్న విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్‌లలో బిటెక్, బిఫార్మసీ, బిఎస్‌సి అగ్రికల్చరల్, ఫార్మా-డీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్-2025 ఫేజ్ 1 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ..ఎపి, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల విద్యార్థులు వీశాట్‌కు హాజరైనట్లు చెప్పారు. వీశాట్-2025 ర్యాంకులతో పాటు జెఇఇ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్ మార్కులను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. వీశాట్‌లో ఒకటి నుంచి 50లోపు ర్యాంకులు సాధించిన వారికి 50 శాతం స్కాలర్‌షిప్, 51 నుంచి 200లోపు ర్యాంకులు సాధించిన వారికి 25 శాతం స్కాలర్‌షిప్, 201 నుంచి 2000 లోపు ర్యాంకులు సాధించిన వారికి పది శాతం స్కాలర్‌షిప్‌ను నాలుగేళ్లపాటు అందజేస్తామని వెల్లడించారు. గుంటూరు, హైదరాబాద్ క్యాంపస్ యూనివర్సిటీలో ప్రవేశాలకు ఈనెల 16 నుంచి 20 వరకు మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. విశాట్ ఫేజ్-2 ప్రవేశ పరీక్షలను ఈ నెల 13 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిస్తామని చెప్పారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ.. విశాట్ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ https://vignan. ac.in/vsatresultలో అందుబాటులో ఉంచామని తెలిపారు. విద్యార్థుల సెల్‌ఫోన్లకు ర్యాంకులు వివరాలను పంపిస్తామని చెప్పారు.

ఎన్నికల సంస్కరణలు అవశ్యం

- రబ్బరు స్టాంప్‌ల ఎన్నికల కమిషన్
- సిద్ధార్థ న్యాయ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ప్రశాంత్ భూషణ్

సదస్సులో మాట్లాడుతున్న ప్రశాంత్ భూషణ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతానికి ఎన్నికల సంస్కరణలు అవసరమని ప్రముఖ అభ్యుదయ వాది, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఉద్ఘాటించారు. శనివారం విజయవాడలోని సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన అధ్యాపకులు చెన్నుపాటి దివాకర్ బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో "భారతదేశంలో భాగస్వామ్య ప్రజాస్వామ్యం బలోపేతం కోసం ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత" అనే అంశంపై ప్రశాంత్ భూషణ్ ఉపన్యాసించారు. భారత రాజ్యాంగానికి పునాది ప్రజాస్వామ్యమని, కానీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం మన దేశ రాజ్యాంగ లక్ష్యాల సాధనలో వెనుకబడిందని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు వారిని ఎన్నుకున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాకుండా వారి వ్యక్తిగత ఆశక్తుల కోసం మాత్రమే పనిచేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో పోలయిన ఓట్లలో ఒకరికి 49 శాతం ఓట్లు వచ్చి ఇంకొకరికి 51 శాతం ఓట్లు వస్తే ఆ 49 శాతం ప్రజల ఓట్లు పొందిన వ్యక్తికి ప్రజాస్వామ్యంలో ఎటువంటి భాగస్వామ్యమూ లేదన్నారు. ధనం, అధికారం అనే చట్రంలో ఇరుక్కొని ఓటేస్తున్న ప్రజలకు పార్లమెంటు చేస్తున్న చట్టాలను పరిశీలించడానికి లేదా అడ్డుకోవడానికి అత్యంత తక్కువ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండానే ఒకేసారి పది నుంచి ఇరవై బిల్లులను ఆమోదిస్తున్న సందర్భం మనం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు కూడా అచేతనంగా మారిపోయిందని విమర్శించారు. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా టిఎన్ శేషన్ నుంచి 2014 వరకు భారత ఎన్నికల కమిషన్ పక్షపాత రహితంగా స్వతంత్రంగా వ్యవహరించిందని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. కానీ, మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత భారత ఎన్నికల సంఘం ఒక రబ్బర్ స్టాంప్‌గా మారిపోయిందని విమర్శించారు. ఎన్నికల ఖర్చుని కేవలం బ్యాంక్ ఖాతా ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే ఖర్చు చేసేవిధంగా నియమాలు మార్చితే ఎన్నికలలో ధన ప్రవాహాన్ని కొంచెం అడ్డుకునే ఆస్కారం ఉందని అన్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా రూ.ఎనిమిది వేల కోట్లు, ఇతర మార్గాల ద్వారా మరో రూ.ఎనిమిది వేల కోట్లు బిజెపికి గత పదేళ్లలో విరాళాలుగా వచ్చాయని అన్నారు. రాష్ట్ర మాజీమంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభానాద్రీశ్వరరావు మాట్లాడుతూ...దేశంలో ప్రస్తుతప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని విమర్శించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నప్పటికీ ఎన్నికల కమిటీల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించడానికి పార్లమెంట్‌లో చట్టం చేశారని, తద్వారా ప్రజాస్వామ్య విలువలను మంటగలిపారని మండిపడ్డారు. కెఎల్ రావు కుమారుడు కె.విజయారావు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట అభివృద్ధికి ప్రణాళిక

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఒంటిమిట్టను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కడప జిల్లా ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధి, యాత్రికుల సౌకర్యాలపై శనివారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ శ్యామలరావు, కడప కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఆలయాన్ని సందర్శించే యాత్రికుల సంఖ్య ఎక్కువగా ఉందని, తగిన విధంగా సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి-కాణిపాకం-తాళ్లపాక, గండికోట (నైట్‌హాల్ట్) ఒంటిమిట్ట, శ్రీకాళహస్తి, సర్క్యూట్‌లను 2, 3 రోజుల పర్యటనతో సాంస్కృతిక టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని టిటిడి, టూరిజం శాఖలను సిఎం ఆదేశించారు. ఒంటిమిట్ట చెరువును సుందరీకరించి బోటింగ్ సౌకర్యంతో మధ్యలో జాంబవంతుని విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. టిటిడి దాతలు, ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా ఒంటిమిట్టలో వసతి మెరుగుకు ప్రణాళిక రూపొందించాలని సిఎం ఆదేశించారు.

12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలి

- గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించి ఆరు నెలల్లోపు రిపోర్టు తెప్పించుకోవాలని, ఈలోగా ఉద్యోగ సంఘాలతో చర్చించి ఇంటీరియమ్ రిలీఫ్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం విజయవాడ విద్యాధరపురంలోని రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు చేసింది. జూన్ నెలలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సిఎం చంద్రబాబు, మంత్రులను, ఉన్నతాధికారులను ఆహ్వానించాలని తీర్మానించింది. ఉద్యోగులకు ఒకటినే జీతాలు, పెన్షన్ల చెల్లింపును చట్టబద్ధం చేయాలని, మెరుగైన విద్యావ్యవస్థ ఏర్పాటుకు చట్టబద్ధ చర్యలు, ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల విలీన సమస్యల పరిష్కారం, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన వ్యవస్థ ఏర్పాటు, గత ప్రభుత్వం రద్దు చేసిన ఎపి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను పునరుద్ధరించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాలను సిఎస్‌కు అందజేయాలని సమావేశం తీర్మానించింది.

ప్రైవేటు భాగస్వామ్యంలోకి అంబేద్కర్ స్మృతివనం

పిపిపి పద్ధతిలో నిర్వహణకు సర్కార్ నిర్ణయం

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడ నగరంలోని స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం రాష్ట్రానికే తలమానికంగా ఉందని చెప్పక తప్పదు. రూ.404 కోట్ల వ్యయంతో 18.81 ఎకరాల విస్తీర్ణంలో గత ప్రభుత్వం దీనిని తీర్చిదిద్దింది. దీనిలో నిర్మించిన సామాజిక న్యాయ మహాశిల్పం అంబేద్కర్ కాంస్య విగ్రహం ఎత్తు 125 అడుగులు. దీని తయారీకి 120 టన్నుల కాంస్యం, 400 టన్నుల స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగించారు. ఈ విగ్రహ పీఠం కింద భాగం 81 అడుగులు ఉంది. దీనిలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ నిర్మించారు. ఆడిటోరియం, అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన ఫొటో గ్యాలరీ, శిల్పాలు, పుస్తకాలతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కాలచక్ర మహా మండల పీఠం బౌద్ధవాస్తు శిల్ప కళతో దీనిని రూపొందించారు. స్మృతివనం ప్రహరీ చుట్టూ 2,200 టన్నుల రాజస్థాన్ పింక్ ఇసుక రాయిని, అక్కడక్కడా పాలరాతిని వినియోగించారు. చిన్నారులకు ఆహ్లాదం కలిగించేందుకు ఆట స్థలం, ఉద్యానవనం, వాటర్ ఫౌంటైయిన్లు, సదుపాయాలు కూడా ఉన్నాయి. ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. 2021 డిసెంబర్‌లో ఈ స్మృతివనం, అంబేద్కర్ మహాశిల్పం నిర్మాణాన్ని ప్రారంచారు. గత ఏడాది జనవరి 19న అప్పటి ముఖ్యమంరతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహాశిల్పంతోపాటు స్మృతివనాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అయితే, అంబేద్కర్ మహాశిల్పం వెనుక భాగంలోని పలు కట్టడాల నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. మహాశిల్పం ముందు భాగం గ్రీనరీ, విగ్రహ పీఠం కింద భాగంలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్‌లు ఉన్నా, పూర్తి స్థాయిలో సందర్శకులకు అనుకూలంగాలేని పరిస్థితి ఉంది. అంబేద్కర్ మహాశిల్పం, స్మృతివనాన్ని ప్రజలు సందర్శించే సమయాన్ని కూడా బాగా కుదించేశారు. ప్రతి రోజూ రాత్రి 7 గంటలకే మూసివేస్తున్నారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న అంబేద్కర్ మహాశిల్పం, స్మృతివనం ప్రారంభమై 15 మాసాలైంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా దీనిలోని పెండింగ్ పనులకు నేటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. పైగా, పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్ పద్ధతిలో దానిని వ్యాపార కేంద్రంగా మార్చి తద్వారా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి ఆదాయ మార్గంగా చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. మిగిలిన పనులకు నిధులు కేటాయించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా దానిని వ్యాపార కేంద్రంగా మార్చే ఆలోచనలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. రాజ్యాంగ నిర్మాత పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో దీనిని బట్టి అర్థమవుతోంది.

పిపిపి పద్ధతిలో స్మృతివనం నిర్వహణ: కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనాన్ని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. స్మృతివనం అభివృద్ధికి త్వరలో టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మీడియాకు ఆయన వెల్లడించారు.

కెవిపిఎస్ ఆగ్రహం

అంబేద్కర్ స్మృతివనంపై కలెక్టర్ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని, పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ పద్ధతిలో నిర్వహించాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఒ.నల్లప్ప, అంద్ర మాల్యాద్రి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకపోతే సమైక్యంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం నిధులు కేటాయించి అంబేద్కర్ స్మృతివనంలో ఆడిటోరియం, వాణిజ్య సముదాయం, బుక్‌స్టాల్, ఫుడ్ కోర్టు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కలెక్టర్ ప్రకటనపై పలు దళిత, ప్రజాసంఘాలు, వామపక్షాలు భగ్గుమంటున్నాయి. వ్యాపార కేంద్రంగా చేసి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపరచొద్దని పలువురు ప్రముఖులు, మేధావులు, అభ్యదయవాదులు డిమాండ్ చేస్తున్నారు.



పిపిపి విధానంతో సామాజిక స్ఫూర్తికి విఘాతం : సిపిఎం

అంబేద్కర్ స్మృతి వనాన్ని పిపిపి విధానంతో నిర్వహించడమంటే సామాజిక స్ఫూర్తిని దెబ్బతీయడమేనని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ స్మృతి వనాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిని మరింత స్ఫూర్తిని నింపేలా నిర్వహించటానికి రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలతో చర్చించాలని కోరారు. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరపటానికి వివిధ తరగతుల ప్రజలు సిద్ధపడుతున్న తరుణంలో ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం మొండిగా ముందుకుపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

అంబేద్కర్ స్మృతివనం నిర్వహణకు పిపిపి మోడ్ వొద్దు : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని పిడబ్ల్యుడి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనం పిపిపి పద్ధతిలో నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో స్మృతివనంలో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా జారీ చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ స్మృతి వనంలో థియేటర్, వాణిజ్య సముదాయం, బుక్ స్టాల్స్, ఆడిటోరియం, ఫుడ్ కోర్టు, ఇతర సౌకర్యాలను ప్రభుత్వ నిధులు కేటాయించి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. వ్యాపార కేంద్రంగా చేసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించొద్దని, ఈ దుర్మార్గమైన విధానంపై పౌర సమాజం స్పందించాలని కోరారు.

ఇన్ సర్వీస్ బిఇడికి అవకాశం ఇవ్వాలి

రాష్ట్రంలో దళిత మహిళా ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ బిఇడి చేసేందుకు అవకాశం ఇవ్వాలని కెవిపిఎస్ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును అంద్ర మాల్యాద్రి మంగళగిరిలోని విద్యాభవన్‌లో శనివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. విద్యాశాఖ పరిధిలో ఇన్‌టైంలోనే అప్లై చేసి, సర్టిఫికెట్లన్నీ ఇవ్వడమే కాకుండా, ఎన్ఒసి కూడా ఇచ్చినా అనేక మంది దళిత మహిళా ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ బిఇడి చేసేందుకు అనుమతి ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. దీనివల్ల వీరంతా ఈ విద్యా సంవత్సరం నష్టపోతారని తెలిపారు. వెంటనే అనుమతినిచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ విజయరామరాజు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వైభవంగా కోదండరాముడి రథోత్సవం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. యాత్రికులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించారు. భజన బృందాలు, చెక్కభజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం, డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, యాత్రికులు పాల్గొన్నారు.

కమిషనర్లు క్షేత్రస్థాయి పర్యటనలు

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్ని మున్సిపాలిటీలలో కమిషనర్లు ఉదయం 6 గంటల నుంచే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని పురపాలకశాఖ మంత్రి పి నారాయణ ఆదేశించారు. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్‌తో కలిసి రీజనల్ డైరెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో శనివారం ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. డ్రైన్‌ల పూడికతీత పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇకపై తాను మున్సిపాలిటీల్లో ఉదయమే ఆకస్మిక తనిఖీలు చేస్తానని తెలిపారు. మెరుగైన పారిశుధ్య పనుల కోసం అవసరమైన స్వీపింగ్ మిషన్లు, ఇతర యంత్రాలను కొత్తగా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. అనారోగ్య కారణాలతో క్షేత్రస్థాయి పర్యటన చేయలేని అధికారులకు డైరెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు.

ఎస్‌వి అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

ప్రజాశక్తి -తిరుమల

శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు విశాఖకు చెందిన మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు రూ.కోటి విరాళంగా అందించారు. తిరుమలలోని టిటిడి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బిఆర్.నాయుడుకు విరాళం డిడిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

సమస్యలు పరిష్కరించిన తర్వాతే రేషనలైజేషన్ ప్రక్రియ

- ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన అనంతరమే రేషనలైజేషన్ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కమిటీ కోరింది. సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె అనూరాధ, ఎం గురుస్వామి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియలో ఒక అడుగు ముందుకు వేసిన ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారంలో కూడా ఒక అడుగు ముందుకు వేయాలని కోరుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా రేషనలైజేషన్ పేరుతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వారి మాతృశాఖ ఏదో తెలియజేసి ఆయా శాఖలకు అప్పజెప్పి, నిర్దిష్ట ప్రమోషన్ ఛానెల్ ప్రకటించాలన్నారు. అంతేకాకుండా అర్హులైన వారికి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయంలో ఒకేజాబ్ చార్ట్ కలిగి పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలను సాంఘిక సంక్షేమ, ఇతర సంక్షేమశాఖలకు తక్షణమే బదిలీ చేయాలన్నారు. సొంత జిల్లాలో కాకుండా ఇతర జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు వెంటనే బదిలీ చేయాలని, రేషనలైజేషన్ చేయడం ద్వారా ఉద్యోగులు మిగిలిపోతారనే ఉద్దేశంతో కొంత మంది ఉద్యోగులను ఓడి పేర్లతో ఇతర శాఖల్లో పని చేయించుకుంటున్నారని, అలా ఓడిపై కాకుండా వారు పనిచేసే శాఖలకు పూర్తిగా అప్పజెప్పాలన్నారు. అదే విధంగా రోజురోజుకూ పెరుగుతున్న సర్వేల భారాన్ని తగ్గించి సర్వేల పట్ల ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ, ప్రజలకు అవగాహన కలిగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణపై ఐక్య పోరాటం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

అభివాదం చేస్తున్న సిహెచ్.నర్సింగరావు, నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం సాగించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. విద్యుత్ రంగం ప్రయివేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ రంగానికి నష్టం కలిగించే ఒప్పందాలను, ప్రజలపై భారాలు పెంచే చర్యలను చేపట్టిందని తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ రంగంలో అక్రమాలను వెలికి తీస్తామని, ప్రజలపై భారాలు మోపబోమని హామీలిచ్చి టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలకు భిన్నంగా గడిచిన పది నెలల కాలంలో ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.15 వేల కోట్ల భారాలను ప్రజలపై ప్రభుత్వం మోపిందని వివరించారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సెకీతో ఒప్పందం చేసుకొని విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచిందని, ఆ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.32 వేల కోట్ల భారాలు పడ్డాయని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేయడం కుదరదని చెప్పడం సరికాదన్నారు. కార్పొరేట్ కంపెనీల లబ్ధి కోసమే పాత ఒప్పందాలను కొనసాగిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రగల్భాలు పలికిన టిడిపి అదే స్మార్ట్ మీటర్లను ఇంటింటికీ బిగించే చర్యలు చేపడుతోందన్నారు. రూ.85 లక్షల కోట్ల విలువైన ఆస్తులున్న విద్యుత్తు రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికులు దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పీస్ రేటు కాంట్రాక్టు పేరిట ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. షిఫ్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు, లైన్‌మ్యాన్లు, సచివాలయం జెఎల్‌ఎంలు తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీలు, మీటర్ రీడర్లు పీస్ రేట్ పద్ధతితో తక్కువ వేతనాలు పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో యూనియన్లతో నిమిత్తం లేకుండా విద్యుత్ ఉద్యోగులందరూ సంస్థను రక్షించుకోవడానికి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయడానికి పోరాటాలు నిర్వహించాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, అధ్యక్షులు సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

ర్యాలీలో పాల్గొన్న కోటేశ్వరరావు, అప్పలరాజు, మత్స్యకారులు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ శనివారం మత్స్యకారులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీనుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ విదేశాలలో నిషేధించబడి, అదేవిధంగా కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి, తొండంగి ప్రాంతంలోని ప్రజలు వ్యతిరేకించినటువంటి బల్క్‌డ్రగ్ పార్కును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి, మత్స్యకారుల ఉపాధికి నష్టం కలిగించే అత్యంత ప్రమాదకరమైన బల్క్‌డ్రగ్ పార్క్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఇప్పటికే హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ వ్యర్థ రసాయన జలాలను సముద్రంలోకి వదలడం వల్ల మత్స్య సంపద నశించిపోయిందని తెలిపారు. మత్స్యకారులు ఉపాధి కోల్పోయి వలసలు పోతున్నారన్నారు. స్థానికంగా ఉన్నవారంతా కేన్సర్, ఊపిరితిత్తులు, చర్మవ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలతో చేతులు కలిపి వారి లాభాల కోసం ఇక్కడి ప్రజల జీవితాలను చిందరవందర చేయడం దారుణమన్నారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండా ముందుకెళ్లడం దుర్మార్గమన్నారు. మత్స్యకారులకు నష్టం కలిగించే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. రాజయ్యపేటలో ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రాజేష్, ఎం.మహేష్ బాబు, విద్యా కమిటీ చైర్మన్ కోడా కాశీరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు పి.తాతీలు, జనసేన నాయకులు పి.స్వామి, మత్స్యకార నాయకులు జి.సోమేశ్వరరావు, బి.నూకరాజు, బి.అప్పలరాజు, ఎం.నరేష్, జి.అంజి, సిహెచ్.తాతాజీ పాల్గొన్నారు.

నెల్లూరులో అమ్మోనియం గ్యాస్ లీక్

- పదిమంది కార్మికులకు అస్వస్థత

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం వరకవిపూడి పంచాయతీ థాపర్ వాటర్ బేస్ కంపెనీలో అమ్మోనియా లీక్ అవ్వడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. కొంతమంది కళ్లమంటలు, ముక్కు, గొంతులో మంట, దగ్గు, వాంతులతో ఇబ్బందిపడ్డారు. ఈ కంపెనీలోని రొయ్యల ప్రాసెసింగ్ జరుగుతోంది. దాదాపు 500 మందికిపైగా కార్మికులు ఈ కంపెనీలో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం ఒక్కసారిగా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ నుంచి అమ్మోనియం గ్యాస్ లీక్ అయింది. దీంతో సుమారు పదిమందికి పైగా కార్మికులు అస్వస్థకు గురయ్యారు. వీరిలో కొందరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారినట్టు తెలుస్తోంది.

అమ్మోనియం గ్యాస్ లీక్‌తో ఉలిక్కిపడ్డ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా కార్మికులను ఆస్పత్రికి తరలించింది. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు స్థానికులు, బాధితులు విజ్ఞప్తి చేశారు.

ఎస్‌సి, ఎస్‌టిల భూములు కబ్జా

- పెత్తందార్ల కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు
- ప్రజా చైతన్య యాత్రలో తిరుపతి తూర్పు మండలాల్లో వెలుగులోకి

పెత్తందారులు ఆక్రమించిన మాజీ దళిత సర్పంచి భూమిని పరిశీలిస్తున్న సిపిఎం, దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా తూర్పు మండలాల్లో దళితులకు, గిరిజనులకు చెందిన వేలాది ఎకరాల భూములను పెత్తందార్లు కబ్జా చేశారు. వాటిలో కొన్ని భూములను బడా పారిశ్రామికవేత్తలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన రెవెన్యూ అధికారులు పెత్తందార్ల కొమ్ముకాస్తున్నారు. సిపిఎం ఇటీవల నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. తూర్పు మండలాల పరిధిలో సత్యవేడు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 22 మండలాల్లో 38 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి ఉన్నారు. వీరంతా రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు. 1972, 1977లో ప్రభుత్వం వీరికి ఇచ్చిన అసైన్డ్ భూములను పెత్తందారులు కబ్జా చేశారు. తమ భూములను తమకు ఇప్పించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ బాధితులు ఏళ్ల తరబడి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో, రోజు గడవడానికి బాధితులు తమ భూముల్లోనే కార్మికులుగా మారాల్సిన దుస్థితి ఏర్పడింది. తిరుపతి జిల్లాలో దాదాపు 1.30 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు దళిత సంఘాలు చెప్తున్నాయి. గత నెల ఎనిమిది నుంచి 17 వరకూ సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలు అనేకం వెలుగులోకి వచ్చాయి. సత్యవేడు నియోజకవర్గంలో దళితుల భూములు, స్మశాన వాటికలు కబ్జాకు గురైనట్టు, ఇళ్ల స్థలాల సమస్య తమ దృష్టికి వచ్చినట్టు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ తెలిపారు.

ఈ నియోజకవర్గం పరిధిలోని పిచ్చాటూరులోని ఓబులరాజుకండ్రిగ గ్రామంలోని 66, 67 సర్వే నంబర్లలో పదేళ్ల క్రితం 65 మందికి ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. ఆ స్థలంలోకి వెళ్లడానికి దారి లేకుండా గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఒకరు ఫెన్సింగ్ వేసి మూసేశారు. దీనిపై లబ్ధిదారులు పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. తాజాగా సర్వే చేసినా సమస్యను పరిష్కరించలేదు. అదే మండలంలో పేరడం గిరిజన కాలనీలోని యానాదులు ఇళ్ల స్థలాల కోసం 15 ఏళ్లుగా సిపిఎం ఆధ్వర్యంలో పోరాడుతున్నారు. మేత బీడు భూముల్లో గుడిసెలు వేసుకునేందుకు వారికి అవకాశం కల్పించాలని అధికారులను సిపిఎం కోరింది. ఈ భూములకు పట్టాలు ఇవ్వలేమని తహశీల్దార్ తెగేసి చెప్పారు. అయితే, అదే గ్రామానికి చెందిన ఓ టిడిపి నాయకుడు ఈ భూముల్లో 14 ఎకరాలు ఆక్రమించుకున్నాడు. దీనికి అడ్డుకోకపోగా ఆ నాయకుడికి రెవెన్యూ అధికారులు పట్టా మంజూరు చేశారు. సత్యవేడు మండలం కొత్తమారికుప్పం దళితవాడ చెందిన వారి 300 ఎకరాలను పెత్తందారులు ఆక్రమించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన మూడు వేల ఎకరాల భూములను పెత్తందార్లు కబ్జా చేసి చెన్నయ్‌కి చెందిన కొందరి పారిశ్రామికవేత్తలకు విక్రయించేశారు. గాజులపెళ్లూరులో వెయ్యి ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. కుక్కంబాకం రెవెన్యూలో తాము సాగు చేసుకుంటున్న 80 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టాలు ఇవ్వాలని దళితులు కోరుతున్నా రీ సర్వే సాకుతో అధికారులు పరిష్కారం చూపలేదు. కెవిబిపురం మండలం రాజులకండ్రిగలో సర్వే నంబర్ 416లో 13 ఎకరాల్లో, 254 సర్వే నంబర్‌లో 12 ఎకరాల్లో ఎస్‌సి, ఎస్‌టిలు మామిడి సాగు చేసుకుంటే, ఆ గ్రామ పెత్తందారులు ఈ 25 ఎకరాల్లోని మామిడి చెట్లను అక్రమంగా తొలగించి ఆ భూములను కబ్జా చేశారు. బాధితుల పక్షాన నిలవాల్సిన పోలీసులు పెత్తందార్ల కొమ్ముకాసి ఎస్‌సి, ఎస్‌టిలపై అక్రమ కేసులు బనాయించారు. మఠం గ్రామ పంచాయతీ దళిత మాజీ సర్పంచ్ వెంకటయ్యకు చెందిన ఐదు ఎకరాల డికెటి భూములను అదే గ్రామానికి చెందిన పెత్తందారు ఆక్రమించాడు.

త్వరలో రణభేరి

పరిశ్రమల ముసుగులో భూసేకరణ పేరుతో తూర్పు మండలాల్లో వేలాది ఎకరాలను ఎస్‌సి, ఎస్‌టి నుంచి ప్రభుత్వం లాక్కొంది. సత్యవేడు ఎస్ఇజడ్ పరిహారాన్ని లబ్ధిదారులైన ఎస్‌సి, ఎస్‌టిలకు కాకుండా వారి భూములను కబ్జా చేసిన పెత్తందార్లకు అధికారులు ఇచ్చారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేసి బాధితులకు న్యాయం చేయాలి. అన్ని మండలాల్లోనూ సర్వే చేసి ఎస్‌సి, ఎస్‌టిల అనుభవంలో ఉన్న భూములను పట్టాలిచ్చి వారికి అప్పగించాలి. ఇందుకోసం వారిని సమీకరించి 'రణభేరి' పేరిట కలెక్టరేట్ వద్ద త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించనున్నాం.

-జనార్ధన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులకు టాప్ మార్కులు

ప్రజాశక్తి - విజయవాడ

ఇంటర్మీడియేట్ 2025 ఫలితాల్లో తమ విద్యార్థులకు స్టేట్ టాప్ మార్కులు వచ్చాయని శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ శ్రీ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 467 మార్కులతో ఇద్దరు స్టేట్ టాప్‌లో, బైపిసిలో ఒక్కరు 437 మార్కులను పొందారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో 992 మార్కులతో ముగ్గురికి స్టేట్ ఫస్ట్ మార్కులు, బైపిసిలో 992 మార్కులతో స్టేట్ టాపర్లుగా తమ విద్యార్థులు నిలిచారన్నారు. జూనియర్ ఇంటర్‌లో 466 ఆపైన 48 మంది, 465 ఆపైన 291 మంది, 460 ఆపైన మార్కులు సాధించిన వారిలో 2628 మంది శ్రీచైతన్య విద్యార్థులు ఉన్నారన్నారు. సీనియర్ ఇంటర్‌లో 992 మార్కులు ఆపైన నలుగురు, 990 ఆపైనా 45 మంది, 980 మార్కులు ఆపైన 1800 మంది, 900 ఆపైనా మార్కులు పొందిన వారిలో 24,331 మంది శ్రీచైతన్య విద్యార్థులున్నారని తెలిపారు. తమ సంస్థ సృష్టించిన పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణతో రాబోయే జెఇఇ మెయిన్, అడ్వాన్డ్, నీట్‌లలో అత్యధిక ర్యాంకులు సాధిస్తారని నమ్మకం ఏర్పడిందని సుష్మ శ్రీ పేర్కొన్నారు. గతేడాది తాము సాధించిన రికార్డులను ఆమె గుర్తు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అపార్ట్‌మెంట్‌లో మంటలు

- ఐదుగురిని రక్షించిన ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటన ఏలూరులోని శాంతినగర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఏలూరు జిల్లా డిఎఫ్ఒ సిహెచ్.రత్నబాబు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని శాంతినగర్ ఏడో రోడ్డులో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల పక్కనే హిమని అపార్ట్‌మెంట్ ఉంది. ఆ అపార్ట్‌మెంట్ ఫోర్-బి ఫ్లాట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో టివి ప్యానెల్ బోర్డులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు హాలు, బెడ్ రూమ్, కిచెన్లలోకి వ్యాపించాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో ఫోర్-బి ఫ్లాట్ పైన ఉన్న ఫ్లాట్‌లో ఐదుగురు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వారిని రక్షించారు. సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని, ఫ్లాట్ విలువ రూ.కోటి వరకు ఉంటుందని ఫ్లాట్ యజమాని శ్రీకాంత్ తెలిపారు. ఆస్తి నష్టం సుమారు రూ.పది నుంచి రూ.13 లక్షల వరకు ఉంటుందని డిఎఫ్ఒ రత్నబాబు చెప్పారు.

వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎంఎ.గఫూర్

బాలానందన్ స్ఫూర్తితో కార్మికోద్యమం బలోపేతం

- రాయలసీమ సిఐటియు ప్రాంతీయ వర్క్‌షాపులో ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచి, నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన బాలానందన్ అడుగుజాడల్లో పయనించి కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ సూచించారు. రెండురోజులపాటు కర్నూలు కొత్త బస్టాండ్ సమీపంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించే సిఐటియు ప్రాంతీయ వర్క్‌షాపును ఆయన శనివారం ప్రారంభించారు. ముందుగా ఉమ్మడి కర్నూలు జిల్లా సిఐటియు సీనియర్ నాయకులు తోట మద్దులు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇ.బాలానందన్ శతజయంతి సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. బాలానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ...కార్మికవర్గ ప్రయోజనాల కోసం బాలానందన్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. 1940లో కేరళలోని అల్యూమినియం పరిశ్రమలో కార్మిక జీవితం ప్రారంభించి, తరువాత జనరల్ ఎలక్ట్రికల్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ, పారిశ్రామిక ప్రాంతమంతటా కార్మికులను సంఘటితం చేసి కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో ముందుండేవారన్నారు. 1944లో అల్యూమినియం ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేయడంలో బాలానందన్ చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో బాలానందన్ మూడుసార్లు అరెస్టు అయ్యారని, ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారన్నారు. 1953లో జాతీయ స్థాయిలో జరిగిన సమ్మెకు దేశవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగుల సమీకరణలో బాలానందన్ అత్యంత కీలకమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. 1967 నుంచి 1968 వరకు, 1970 నుండి 1976 వరకు కేరళ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా, 1980లో లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. పార్లమెంటరీ కమిటీలలో కార్మికవర్గ ప్రయోజనాల కోసం ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. 1972లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, కడప జిల్లా కార్యదర్శి మనోహర్, నంద్యాల జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు, అనంతపురం జిల్లా అధ్యక్షులు నాగమణి, సత్యసాయి జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సరుకు రవాణా ద్వారా రూ. 431 కోట్ల ఆదాయం

- గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు డివిజన్‌కు సరుకు రవాణా ద్వారా 2024-25లో రూ.431 కోట్లు ఆదాయం వచ్చిందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణ సేన్ తెలిపారు. కొత్త రైల్వే లైన్లకు డిపిఆర్‌లు, పలు ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని, గుంటూరు-గుంతకల్లు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ల పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతతో పాటు రైల్వే సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. రైల్వే వ్యవస్థలో సమయపాలన పాటించాలన్న విషయంలో ప్రతి ఒక్కరికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. నిర్దేశిత సమయంలోనే రాకపోకలను కొనసాగించేలా పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు.

భారత ఎగుమతుల్లో అనిశ్చితి

న్యూఢిల్లీ : అమెరికా సుంకాలను నిలిపివేసినప్పటికీ భారత ఎగుమతుల్లో అనిశ్చితి నెలకొంది. చాలా దేశాలపై అమెరికా విధించిన పరస్పర సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేయడం భారత ఎగుమతిదారులకు తాత్కాలిక ఉపశమనం కలిగించింది. అయినప్పటికీ అమలులో ఉన్న 10 శాతం బేస్‌లైన్ సుంకాల భారాన్ని ఎవరు భరించాలనే దానిపై ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సుంకం తమ లాభాలను ఒత్తిడికి గురి చేస్తోందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. వియత్నాం, బంగ్లాదేశ్ వంటి పోటీ దేశాలు బేస్‌లైన్ సుంకాలను భర్తీ చేయడానికి అమెరికా కొనుగోలుదారులకు డిస్కౌంట్లను అందించవచ్చని ఎగుమతిదారులు అంటున్నారు. భారత్ కంటే ముందు ఆయా దేశాలు అమెరికాలో ద్వైపాక్షిక ఒప్పందాలకు సిద్ధం అవుతున్నాయని తెలిపాయి. "10 శాతం బేస్‌లైన్ టారిఫ్‌ను ఎవరు చెల్లిస్తారనేది పెద్ద ప్రశ్న..? ఇది వినియోగదారుడా, దిగుమతిదారుడా, ఎగుమతిదారుడా లేదా వారందరూ పంచుకుంటారా? ఏదైనప్పటికీ పరిశ్రమలో డిమాండ్ తగ్గడం ద్వారా మార్జిన్లు పడిపోనున్నాయి." అని టెక్స్‌టైల్ కమిటీ ఐసిసి ఛైర్మన్ సంజయ్ జైన్ పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఇ మరో మైలురాయి

ముంబయి : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఇ) 2025 ఏప్రిల్‌లో మరో మైలురాయిని అధిగమించినట్లు తెలిపింది. యూనిక్ క్లయింట్ కోడ్‌లు, ఖాతాలు 22 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. 2024 అక్టోబర్ 20 నాటికి 20 కోట్లుగా ఉన్న సంఖ్య.. ఆరు నెలల్లోనే భారీగా పెరిగిందని పేర్కొంది. మహారాష్ట్ర, యుపి, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు 49 శాతం వాటా కలిగి ఉన్నాయని ఎన్‌ఎస్‌ఇ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ పేర్కొన్నారు. దేశంలో ఇన్వెస్టర్ల సంఖ్య వేగంగా పెరుగుతోందన్నారు.

ఎసి అమ్మకాల్లో రెట్టింపు వృద్ధి

- సామ్‌సంగ్ వెల్లడి

గూర్‌గావ్: ప్రస్తుత ఏడాది జనవరి నుంచి మార్చి కాలంలో తమ ఎసి అమ్మకాల్లో రెట్టింపు వృద్ధిని నమోదు చేశామని సామ్‌సంగ్ డిజిటల్ అప్లయిన్సెస్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ గుఫ్రాన్ అలాం తెలిపారు. ఈ రంగం పరిశ్రమ 20-25 శాతం పెరుగుదలను చవి చూడగా.. తమ సంస్థ మరింత మెరుగ్గా రాణించిందన్నారు. ఎసి విభాగంలో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 10 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నామన్నారు. తమ కొత్త బెస్పోక్ ఎఐ విండ్ ఫ్రీ ఎసి శ్రేణీ ధరలు రూ.32,990-రూ.60,990గా ఉన్నాయన్నారు.

అమెజాన్ పే వేసవి ప్రత్యేక డీల్స్

హైదరాబాద్: ఉత్తమమైన వేసవి విడిది ప్రణాళికల్లో అమేజాన్ పేను ఉపయోగించడం ద్వారా ప్రత్యేక డీల్స్‌ను పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది. విమానాలు, హోటళ్లు, మూవీ టిక్కెట్లు తదితర ఎన్నో వాటిపై ప్రత్యేకమైన ప్రయోజనాలను అందిస్తున్నట్లు పేర్కొంది. పలు ఎయిర్‌లైన్స్‌లో 25 శాతం వరకు రాయితీ పొందవచ్చని పేర్కొంది. హోటళ్ల బుక్కింగ్‌పై 18 శాతం క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు తెలిపింది. అమెజాన్ పే ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డును ఉపయోగించడం ద్వారా 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చని పేర్కొంది.

యుపిఐ సేవల్లో అంతరాయం

న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యుపిఐల్లో మరోమారు అంతరాయం చోటు చేసుకుంది. దేశ వ్యాప్తంగా ఈ సేవలు స్తంభించడంతో పలు చెల్లింపులు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గూగుల్ పే, ఫోన్‌పే, పేటియం, ఇతర థర్డ్ పార్టీ యాప్స్ పని చేయలేదు. దీంతో సామాజిక మాధ్యమాల్లో వేలాది మంది నెటిజన్లు తన నిరసన, అసహనంను వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్య వల్ల చెల్లింపుల్లో అవాంతరం చోటు చేసుకుందని ఎన్‌పిసిఐ తెలిపింది. దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఇంతక్రితం మార్చి 26న, ఏప్రిల్ 2న కూడా యుపిఐ చెల్లింపుల్లో అంతరాయం చోటు చేసుకుంది.

సంపాదకీయం

ఒక్క అడుగుతో పెద్ద మార్పు!

'పక్షులు మానవునికి జీవన గమనం నేర్పుతాయి. వాటిని కాపాడటం మన కర్తవ్యం' అంటారు భారతదేశ పక్షి శాస్త్ర పితామహుడు సలీం అలీ. జీవ పరిణామ క్రమంలో ఉద్భవించిన అద్భుత జంతుజాలమే పక్షులు. ఈ సృష్టిలో పక్షులది ఒక ప్రత్యేకమైన స్థానం. ప్రకృతికి అందాన్ని, మానవాళికి జీవవైవిధ్యంతో పాటు ఆనందాన్ని అందిస్తాయి. 'భూమిపై జీవితం యొక్క గొప్ప ఆనందాలలో పక్షుల గానం ఒకటి' అంటారు ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు రాబర్ట్ లిండ్. వీటి జీవన విధానం మనిషికి సహనాన్ని, శ్రమను, స్వేచ్ఛను నేర్పుతాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకమైన పాత్ర పోషిస్తాయి. పక్షులు-పర్యావరణం మధ్య ఉన్న అవినాభావ సంబంధం మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమైనది. వ్యవసాయంలో కీలకమైన పాత్ర వహిస్తాయి. పంటలకు హానిచేసే, కీటకాలను, పురుగులను తినడం ద్వారా తెగుళ్లు రాకుండా పరోక్షంగా పంటలను రక్షిస్తాయి. పువ్వుల్లోని పుప్పొడిని ఒకచోటు నుండి మరోచోటుకు తీసుకువెళ్లి పునరుత్పత్తికి సహాయపడతాయి. విత్తనాలను వ్యాప్తి చేయడంలో సహాయపడటం ద్వారా అడవుల పెరుగుదలకు సహకరిస్తాయి. చనిపోయిన జంతువులను తినే రాబందు వంటి పక్షులైతే పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలోనూ సహాయపడతాయి. అందుకే-'పక్షులు వ్యవసాయానికి, పర్యావరణానికి సహజ మిత్రులు' అంటారు.

ఒక్క మాటలో చెప్పాలంటే, పక్షులు మానవాళికి అవసరమైన ఆహార గొలుసులో ముఖ్యమైన భాగంగా ఉంటూ పర్యావరణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్రాముఖ్యతను వివరిస్తూ 'ప్రతిదీ మరొకదానితో ముడిపడి ఉంది' అంటారు జాన్ ముయిర్. పర్యావరణంలోని ఈ సంక్లిష్టమైన సంబంధాలలో పక్షులు ఒక ముఖ్యమైన బంధం. పక్షులు, మూగజీవాలు కళ్ల ముందే చనిపోతున్నా పెద్దగా పట్టించుకోరు చాలామంది. కానీ, ఓ పక్షి ప్రాణాలు కాపాడేందుకు స్వయంగా జడ్జి, కలెక్టర్ రంగంలోకి దిగారు. కన్నూరు జిల్లా, ఉల్లిక్కల్ పంచాయతీ పరిధిలోని మూసేసిన ఓ టెక్స్‌టైల్ షాపు గ్లాస్ ప్యానెల్‌లో ఓ పక్షి చిక్కుకుంది. ఆ ప్యానెల్‌లో నుంచి బయట పడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. కానీ సాధ్యం కాలేదు. పక్కనున్న షాపులవాళ్లు చూసినా కాపాడలేని పరిస్థితి. బిజినెస్ పార్ట్‌నర్స్ మధ్య ఏర్పడిన వివాదం కారణంగా ఆ షాపును కొన్ని నెలల క్రితం కోర్టు సీజ్ చేసింది. షాపు తెరవాలంటే, కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే. ఇందుకోసం జిల్లా కలెక్టర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. దీనిపై స్పందించిన జడ్జి... నేరుగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. షాపును తెరిపించి, మూడు రోజులపాటు గ్లాస్ ప్యానెల్‌లో చిక్కుకున్న పక్షిని ప్రాణాలతో కాపాడారు. ఆ పక్షి... స్వేచ్ఛగా గాల్లోకి ఎగిరిపోయింది.

అయితే, పక్షుల మనుగడ నేడు ప్రమాదంలో పడింది. ఈ ఒక్క పక్షినైతే రక్షించగలిగారు. కానీ, పట్టణీకరణ, అడవుల నిర్మూలన, కాలుష్యం, వ్యవసాయంలో రసాయనాల వినియోగం వల్ల పక్షుల ఆవాసాలు తగ్గిపోతున్నాయి. ఆహారం లభించక, విషపూరితమైన వాతావరణంలో జీవించలేక అనేక పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. 'అభివృద్ధి క్రమం అంతా ప్రకృతి హక్కుల ఉల్లంఘనే' అంటారు పర్యావరణ కార్యకర్త సత్యశ్రీనివాస్. ఆధునిక సాంకేతికత అభివృద్ధి వల్ల పక్షుల మనుగడకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది. సెల్‌టవర్ల నుంచి వచ్చే రేడియో తరంగాలు వీటిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పక్షుల సంఖ్య తగ్గిపోవడం కేవలం ప్రకృతికి జరిగే నష్టం మాత్రమే కాదు, ఇది మానవాళి మనుగడకు కూడా పెను ముప్పుగా మారుతున్నది. పక్షులు, పర్యావరణం మనకు వారసత్వంగా లభించిన సంపద. ఈ సంపదను కాపాడుకోవడం ద్వారానే భవిష్యత్తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించగలం. 'పక్షులను కాపాడటం అంటే, ప్రకృతిని కాపాడటం. ప్రకృతి లేని జీవితం అసంభవం' అని ఎల్డో లియోఫోల్డ్ అంటారు. చిన్నచిన్న చర్యలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నట్లుగా...కలెక్టర్, జడ్జి మాదిరిగా, పర్యావరణ పరిరక్షణకు మనం వేసే ఒక్క అడుగే పెద్ద మార్పునకు దారితీస్తుంది.

నలుగురూ నడిచే దారిలో నడవడం క్షేమం అనుకుంటారు అందరూ. అందుకే అన్ని విషయాల్లోనూ మూస పద్ధతులను అనుసరిస్తారు. వాటిని వదిలేసి సొంత ఆలోచనలతో ముందుకు వెళ్తూ ఆదర్శంగా నిలిచేవాళ్లు చాలినంత మంది సమాజంలో కనపడరు. అందుకే సంఘసంస్కరణకి శతాబ్దాలు పడుతుంది.

- రాహుల్ సాంకృత్యాయన్,
ప్రఖ్యాత రచయిత.
జననం : 9.4.1893 మరణం : 14.4.1963

వక్ఫ్ చట్టంలో వక్రబుద్ధులు

ప్రస్తుతం

తెలకపల్లి రవి

కొత్త వక్ఫ్ చట్టంపై దేశవ్యాప్తంగా నిరసన ఎదుర్కొంటున్న నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ దాన్ని ముస్లింల ప్రయోజనాల కోసమే తీసుకువచ్చినట్టు, వ్యతిరేకించే వాళ్ళు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నట్టు దుష్ప్రచారం ప్రారంభించింది. ఇందుకోసం ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే5 వరకు దేశవ్యాప్తంగా విస్తృతమైన ప్రచారం సాగించాలని కూడా నిర్ణయించుకుంది. మీడియాలో దీనిపై విస్తారమైన కథనాలు ఇప్పటికే వదులుతున్నారు. బిజెపి ముఖ్యమంత్రులైన దేవేంద్ర ఫడ్నవిస్ వంటి వారు బిల్లు చట్టం కాకముందే మహారాష్ట్రలో ఇన్ని వేల ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులకు దిగారు. నిజంగా ఈ చట్టంలో ఏముంది? లాభమా నష్టమా? నిజంగా రాజకీయ విమర్శ ఉద్యమం అవసరమా? లాంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసులను అత్యవసర ప్రాతిపదికన తీసుకోవాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు ఆమోదించలేదు. వక్ఫ్ చట్టంపై పిటిషన్లతో పాటు మత మార్పిడుల చట్టాలకు అనుకూలంగా వ్యతిరేకంగా కూడా కేసులలో ఏప్రిల్ 16న విచారణ ప్రారంభిస్తున్నది. ఒక విధంగా ఆ రోజుతో ఈ అంశంపై న్యాయ పోరాటాలు కూడా ప్రారంభమవుతా యన్నమాట. తాము ఈ చట్టాన్ని అమలు జరుపబోమని జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు ప్రకటించారు.

ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించాలనే నిబంధనను ప్రస్తుతానికి పక్కన పెట్టాలని సూచించినట్టు లీకులు ఇస్తున్నారు. ఒక ఎకరం నుంచి 200 ఎకరాల వరకు వక్ఫ్ ఆస్తుల్ని లీజుకు ఇస్తామని, ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలను ఆహ్వానిస్తూ పత్రికల్లో వ్యాపార ప్రకటనలు జారీ చేసింది. జమ్ము కాశ్మీర్‌లో అయితే ఇప్పుడున్న అధ్యక్షురాలు బిజెపి నియమించబడిన వ్యక్తిగా బలపరుస్తుంటే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కనుక వక్ఫ్ చట్టం వక్రీకరణలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో ఇప్పుడే తెలిసిపోతున్నది.

అసత్య ప్రచారాలు

1954 వక్ఫ్ చట్టాన్ని 1995లో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు అనుగుణంగా సవరించిందని, 2013లో వాటిని మరింత అనుకూలంగా మార్చిందని బిజెపి ఆరోపణ. మైనారిటీల స్థితిగతులను అధ్యయనం చేసి తగు సిఫారసులు చేసేందుకై నియమించబడిన జస్టిస్ సచార్ కమిటీ వక్ఫ్ ఆస్తుల మీద ఇచ్చిన సూచనల స్ఫూర్తిని కాపాడేందుకే తాము 2024 శాసనం తీసుకొచ్చామని కేంద్ర నేతలు చెప్పుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి) తయారు చేసిన సమాచారంలో కూడా గత బిల్లు ముస్లింలకు అనుకూలంగా ఉందని ఆరోపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. భిన్న మతాలతో కూడిన ఈ విశాల దేశంలో మైనారిటీలు అంటే అల్ప సంఖ్యాక వర్గాలు రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కలిగి ఉన్నారు. అది ప్రజాస్వామ్య లక్షణం కూడా. మరి వారి మత వ్యవహారాలకు సంబంధించిన చట్టాలు వారికి అనుకూలంగా కాక వ్యతిరేకంగా ఉండటం ఎలా సాధ్యం? ఏ విధంగా న్యాయం? కేంద్రం చేస్తున్న ఈ ఆరోపణలోనే వారి అసలు వ్యూహం అర్థమవుతుంది. బిజెపి దీనిపై హడావుడి పడిందంటే లోక్‌సభ తర్వాత రాజ్యసభలో అర్ధరాత్రి రెండున్నర గంటలకు తీవ్ర వాదోపవాదాల మధ్య ఆమోదింప చేసుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రపతి గజట్ కూడా జారీ చేయడంతో 8వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. చెప్పాలంటే చాలామంది విద్యాధికులకు కూడా ఇప్పటికీ ఈ వ్యవహారం గురించి పూర్తి స్పష్టత రాలేదు. దానికి చాలా సమయం పట్టవచ్చు. కానీ ఆలోగానే వివాదాలు మాత్రం పెరిగిపోవటం, రగిలించడం అనివార్యంగా కనిపిస్తున్నది. ఈ చట్టంలో వ్యూహం, ఉద్దేశం కూడా అది.

బుజ్జగింపు రాజకీయాల కోసమే వక్ఫ్ చట్టంపై వివాదం సృష్టిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. దీని మీద జరిగిన చర్చ చారిత్రాత్మకమైనది అన్నారు. నిజంగానే లౌకికతత్వం, మత సామరస్య సంబంధాల పరిరక్షణపై ఈ చట్టం తీవ్ర ప్రభావమే చూపిస్తుంది.

అన్ని తిరకాసులూ రివర్స్‌లే!

వక్ఫ్ చట్టం కింద నాలుగు రకాలుగా ఆస్తులు ఏర్పడతాయి. ఒకటి-ఆస్తులను దేవుడికి (అల్లాకు) అప్పగిస్తున్నట్లుగా దాన పత్రాలు, దస్తావేజులు తయారు చేయించడం. రెండు-దాతలు నోటి మాటతో ఏదైనా సందర్భంలో ప్రకటించటం. మూడు-వాడుకలో ఆ స్థలం లేదా ఆస్తి దేవుడి సంబంధమైన మత క్రతువులకు వినియోగంలో ఉండటం. నాలుగు-ప్రభుత్వం వక్ఫ్‌కు ఏదైనా భూమిని ఇవ్వటం. ఇప్పుడు ఈ చట్టం ప్రకారం వాడుకలో వక్ఫ్ అనే అంశం చెల్లదు. దస్తావేజులు తప్పనిసరిగా ఉండాలనేట్టయితే వందల ఏళ్ళ క్రమంలో అనేక వక్ఫ్ ఆస్తులకు దస్తావేజులు లేవు. రాజులతో సహా నోటి మాటతో ఇచ్చినవి అనేకం. ఆ విధంగానే తరాల పర్యంతం వాడుకలో ఉంటున్నాయి. ఇప్పుడు వాటిని వివాదాస్పదం చేయటం చాలా సులభం. బాబ్రీ మసీదు రామ జన్మభూమి వివాదం నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి వరకు మనం చూస్తున్నది అదే.



కేంద్ర ప్రభుత్వ సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి) తయారు చేసిన సమాచారంలో కూడా గత బిల్లు ముస్లింలకు అనుకూలంగా ఉందని ఆరోపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. భిన్న మతాలతో కూడిన ఈ విశాల దేశంలో మైనారిటీలు అంటే అల్ప సంఖ్యాక వర్గాలు రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కలిగి ఉన్నారు. అది ప్రజాస్వామ్య లక్షణం కూడా. మరి వారి మత వ్యవహారాలకు సంబంధించిన చట్టాలు వారికి అనుకూలంగా కాక వ్యతిరేకంగా ఉండటం ఎలా సాధ్యం? ఏ విధంగా న్యాయం? కేంద్రం చేస్తున్న ఈ ఆరోపణలోనే వారి అసలు వ్యూహం అర్థమవుతుంది. బిజెపి దీనిపై హడావుడి పడిందంటే లోక్‌సభ తర్వాత రాజ్యభలో అర్ధరాత్రి రెండున్నర గంటలకు తీవ్ర వాదోపవాదాల మధ్య ఆమోదింప చేసుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రపతి గజట్ కూడా జారీ చేయడంతో 8వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. చెప్పాలంటే చాలామంది విద్యాధికులకు కూడా ఇప్పటికీ ఈ వ్యవహారం గురించి పూర్తి స్పష్టత రాలేదు. దానికి చాలా సమయం పట్టవచ్చు. కానీ ఆలోగానే వివాదాలు మాత్రం పెరిగిపోవటం, రగిలించడం అనివార్యంగా కనిపిస్తున్నది. ఈ చట్టంలో వ్యూహం, ఉద్దేశం కూడా అది.

అసలు 'వక్ఫ్ చట్టం' అన్నదాన్ని కాస్త 'ఉమ్మడి నిర్వహణ సాధికారత సమర్థత అభివద్ధి చట్టం' అని మార్చారు. దేవాదాయ ధర్మాదాయ చట్టం కింద ఆలయ భూములు వంటివి చూస్తున్నారు కానీ ఈ రకమైన పరిభాష ఎక్కడా లేదు. వినియోగదారుడు లేదా ధార్మిక సంస్థ దాన్ని వక్ఫ్‌కు అప్పగించినట్లు ప్రకటించవచ్చునని ప్రస్తుత చట్టం చెబుతున్నది. 1. ఇప్పుడు చేసిన మార్పుల ప్రకారం ఐదు సంవత్సరాలుగా ముస్లింలుగా ఉండి ఆ విశ్వాసాలు పాటిస్తున్న వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ప్రకటన లేదా దానం ఇతర మతాలవారు చేస్తే చెల్లదని చెప్పడం ద్వారా భిన్న మతాల వారికి అవకాశం లేకుండా పోతున్నది. 2. ప్రభుత్వ ఆస్తులు వక్ఫ్‌గా స్థిరపడి ఉంటే గతంలో వాటిని అలాగే పరిగణిస్తున్నారు. కొత్త చట్టంలో వక్ఫ్ ఆస్తులుగా వాడుకలో ఉన్నవి అలా కొనసాగవు. దీనిపై వచ్చే విభాగాలను కలెక్టర్ ప్రభుత్వం ముందు ఉంచి పరిష్కరిస్తారు. 3. ఏది వక్ఫ్, ఏది కాదు అన్నది నిర్ణయించే అధికారం గతంలో బోర్డుకు ఉండేది. ఇప్పుడు ఆ నిబంధనను తొలగించి పూర్తిగా ప్రభుత్వాలకు అప్పగిస్తున్నారు. 4. ఈ ఆస్తులపై సర్వే గతంలో కమిషనర్లు అదనపు కమిషనర్లు నిర్వహించేవారు. ఇప్పుడు రెవెన్యూ చట్టాల ప్రకారం వాటి నిర్వహించే అధికారం కలెక్టర్లకు అప్పగించారు. 5. గత చట్టంలో ఇద్దరు మహిళలతో సహా ముస్లింలు మాత్రమే ఈ కమిటీ బోర్డుల్లో సభ్యులుగా నియమితులయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడు ఇద్దరు ఎంపీలు, మాజీ న్యాయమూర్తులు, ప్రముఖ వ్యక్తులు ముస్లింలు కాకపోయినా ఇందులో సభ్యులు కావచ్చు. ముస్లిం సంస్థల ప్రతినిధులు, ఇస్లామిక్ చట్టాలు పండితులు మాత్రమే ఆ మతానికి చెందిన వారై ఉండాలి. వారిలో ఇద్దరు మహిళలు ఉండాలి. 5.ఎన్నికైన ఇద్దరు ముస్లిం ఎంపీలు, ఎమ్మెల్యేలు, బార్ కౌన్సిల్ సభ్యులు రాష్ట్రాల వక్ఫ్ బోర్డులలో సభ్యులుగా ఉండాలని గతంలో ఉంది. ఇప్పుడు ఇద్దరు ముస్లిం అధికారులను, షియా సున్నీల నుంచి ఒక్కొక్కరిని, బహుళ ఆగాఖాన్ వర్గాల నుంచి ఒక్కొక్కరిని, ఇద్దరు ముస్లిం మహిళలను తప్పనిసరిగా సభ్యులను చేయాలి. 6. ఇక వక్ఫ్ ట్రిబ్యునల్‌లో ఒక జడ్జి ఆధ్వర్యంలో అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ముస్లిం చట్టాల నిపుణుడు ఉండాలని గత చట్టంలో ఉంటే ఇప్పుడు ముస్లిం చట్టాల నిపుణుడు అన్నది తొలగించారు. జిల్లా కోర్టు జడ్జి చైర్మన్‌గా ఉండగా ప్రభుత్వం తరపున జాయింట్ సెక్రెటరీ ఉంటారు. 7.ట్రిబ్యునల్ తీర్పులపై గత చట్టం ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే హైకోర్టులు జోక్యం చేసుకోవచ్చు. కొత్త చట్టంలో ఏ వివాదమైనా 90 రోజుల లోపల హైకోర్టుకు వెళ్ళవచ్చు. 8.పాత చట్టంలో బోర్డు ఆడిటింగ్ పర్యవేక్షణ అంశాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండేవి. కొత్త చట్టం ప్రకారం కేంద్రానికే అధికారాలు ధారాదత్తం అవుతున్నాయి. అంటే వున్న నిబంధనలు మార్చడం, కొత్తవి చేర్చడం ఆదేశాలు ఏవైనా చేయొచ్చు. భిన్న పార్టీలు పాలించే సందర్భంలో ఇది సమాఖ్య తత్వాన్ని దెబ్బతీయడమే గాక సమస్యాత్మకంగా మారుతుంది 9. షియా సున్నీలు గనక 15 శాతం మించి వుంటే ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయొచ్చని గతంలో వుండేది. ఇప్పుడు ఆగాఖానీ బోహ్రాలకు కూడా ఆ విధంగా వేరే బోర్డుల ఏర్పాటుకు అవకాశమిచ్చారు. వాస్తవానికి వారి సంఖ్య అంత వుండదని, అనవసరంగా చీలికలు తేవడానికే ఈ నిబంధన తెచ్చారని విమర్శలున్నాయి.

సచార్ కమిటీ మాటేంటి?

ఇప్పుడు సచార్ కమిటీ దగ్గరకు వస్తే దాని సిఫార్సులను అమలు చేయడానికి ఈ మార్పులు అన్నది మరీ అవాస్తవం. ఆ కమిటీ చెప్పిన ఒక్క చిన్న సిఫార్సును కూడా ఇందులో పొందుపరచలేదు. ఉదాహరణకు సచార్ కమిటీ వక్ఫ్ ఆస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చెప్పింది. యుపిఎ ప్రభుత్వం 2014లో దిగిపోయే ముందు రూ.500 కోట్లతో ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది కూడా. కానీ గత పదేళ్లలో ఈ కార్పొరేషన్ నిర్వీర్యమై ఇప్పుడు మూసివేతకు సిద్ధంగా ఉంది. ముస్లింలలో భిన్న వర్గాలకు చోటు కల్పించాలనే వాదనతో కూడా ఆ యా నేతలు ఏకీభవించడం లేదు. బోహ్రా, ఆగాఖానీలు షియా వర్గంలో ఉంటారని వారిని ప్రత్యేకంగా చూపడం ద్వారా బిజెపి ముస్లిం సమాజంలో చీలికల కోసం ప్రయత్నిస్తున్నదని కొందరు ఆరోపిస్తున్నారు.

గతంలో వక్ఫ్ బోర్డులకు సంబంధించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలకు అధ్యక్షులుగా ఉన్న రాజ్యసభ మాజీ ఉపాధ్యక్షుడు కె.రహమాన్ ఖాన్ మాట్లాడుతూ ఈ చట్టం వక్ఫ్ బోర్డులను సంస్కరించడానికి కాక దెబ్బ తీయటానికే ఉద్దేశించబడిందని అన్నారు. ఇటీవల మదురైలో ముగిసిన సిపిఎం 24వ మహాసభ కూడా ఈ అంశంపై ప్రత్యేక తీర్మానం ఆమోదించింది. గతంలో ఉన్న వక్ఫ్ చట్టం సదరు ఆస్తులను నిర్వహించేందుకు ఒక చట్టబద్ధమైన వ్యవస్థగా ఉండేదని ఈ కొత్త చట్టం హిందుత్వ ఎజెండాతో ప్రజల మధ్య చీలికలు తెచ్చేందుకు పాల్పడుతోందని విమర్శించింది. ఇస్లామిక్ నిబంధనల ప్రకారం ఇతర మతస్తులు నిర్వహణలో పాల్గొనరాదని ఉన్నా ఇద్దరు ఇతర మతస్తులను చేర్చాలని నిర్దేశించడం ద్వారా వారి రాజ్యాంగ, మత హక్కులకు భంగం కలిగిస్తున్నట్టు పేర్కొన్నది.

అతిశయాల వ్యాప్తి

మరోవైపున దేశంలో వక్ఫ్ ఆస్తులు ఎన్ని? ఎంత విలువ? అన్న అంశంపై తలాతోక లేని లెక్కలు వెలువడుతున్నాయి. రూ.లక్షల కోట్ల విలువ లక్షల ఎకరాల భూమిని ఆ మతస్తులు అన్యాయంగా అనుభవిస్తున్నట్టు దురభిప్రాయం కలిగించే పెద్ద ప్రయత్నం సాగుతున్నది. ఆక్రమణదారులు, అవినీతిపరులు ఏ మతానికి చెందిన వారైనా శిక్షార్హులే. కానీ దానికి మతం రంగు పూసి, ఈ దేశపు భూమిని మరెవరో దురాక్రమణదారులు సొంతం చేసుకున్నారన్న భావం కలిగించటం మత విద్వేషాలకు దారితీస్తుంది. కానీ కొత్త చట్టం మాత్రం కొత్త వివాదాలకు మార్గం కాకుండా శక్తులు గొంతు ఎత్తవలసి ఉంటుంది. న్యాయవ్యవస్థ సకాలంలో జోక్యం చేసుకోవడమే దీనికి విరుగుడు అవుతుంది. ఏప్రిల్ 16న సుప్రీంకోర్టు అలాంటి వివాదాలకు అవకాశం లేకుండా మైనార్టీల మత హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటుందా?

ఆస్తులు వాస్తవాలేంటి?

ఇంతకూ దేశంలో 8.8 లక్షల వక్ఫ్ ఆస్తులు వున్నాయనీ వాటిలో 9.4 లక్షల కోట్ల ఎకరాలు రూ.1.2 లక్షల కోట్ల విలువ కలిగివున్నాయని కేంద్రం చెబుతుంది. సైన్యం, రైల్వేల తర్వాత వక్ఫ్ ఆస్తులే ఎక్కువని పార్లమెంటులోనే ప్రకటించారు. వాస్తవానికి తిరుపతి వెంకన్న ప్రపంచంలోనే ధనవంతుడైన దేవుడని ఎప్పుడూ వినేవాళ్లకు ఇది ఆశ్చర్యం కలిగించవచ్చు. ఆ సంగతి అలా వుంచితే పై ఆస్తులలో సగం అంటే 4.36 లక్షల ఆస్తులకు సరైన పత్రాలు లేవని కేంద్రం అంటోంది. ఇప్పటికే దేశంలో దాదాపు 41 వేల కేసులు నడుస్తున్నాయి. ముస్లింలే వేసిన కేసులు దాదాపు పదివేలున్నాయి. మూడున్నర లక్షల ఎస్టేట్లు వక్ఫ్ కింద వున్నాయని అధికారిక లెక్క. అయితే 2006లో సచార్ కమిటీ చెప్పిన ప్రకారం 4.9 లక్షల వక్ఫ్ ఆస్తుల అధికారిక విలువ రూ.6,600 కోట్లుగా గుర్తించారు. వీటిపై కేవలం ఏటా రూ.160 కోట్లు మాత్రమే వస్తున్నందున సమర్థంగా నిర్వహించాలని సూచించింది. అదే సమయంలో వీటిలో నిరుత్పాదక ఆస్తులు అనేకం వున్నాయని పేర్కొంది. లక్షన్నర శ్మశానాలే వున్నాయి. మసీదులు మరో లక్షా 20 వేల వరకూ వున్నాయి. మదర్సాలు, ఈద్గాలు కూడా నడుస్తున్నాయి. కనక కేంద్రం ఒకవైపు నుంచి మాత్రమే చిత్రిస్తున్నట్టు స్పష్టమవుతుంది.

లౌకిక రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి

కె.యస్.లక్ష్మణరావు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమయంలోనే రాజ్యాంగ మౌలిక స్వరూప అంశాలైన ఫెడరలిజం, లౌకికవాదం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, న్యాయశాఖ స్వతంత్రత మొదలైన వాటిని కాపాడుకోవాలనే చర్చ విస్తృత స్థాయిలో జరుగుతున్నది. గవర్నర్ల అధికారాలు, వక్ఫ్ చట్టం, జమిలి ఎన్నికలు, డీలిమిటేషన్ మొదలైన అంశాలపై కూడా అనేక అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. దీనికి కారణం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం, ప్రత్యేకించి నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి.... రాజ్యాంగ మౌలిక అంశాలపై దాడి చేయటమే.

రాజ్యాంగ మౌలిక స్వరూపం

1973లో భారత సుప్రీంకోర్టు కేశవనాంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో చారిత్రాత్మకమైన తీర్పు చెప్పింది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్పు చేసే అధికారం పార్లమెంట్‌కు లేదని చెప్పింది. మౌలిక స్వరూప లక్షణాలుగా ఫెడరలిజం, లౌకికవాదం, రాజ్యాంగ ఆధిక్యత, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, న్యాయశాఖ స్వతంత్రత మొదలగు వాటిని తెలిపింది. గత పదేళ్లుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బ తీయటానికి ప్రయత్నిస్తున్నది.

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం

రాజ్యాంగంలోని ఒకటవ నిబంధన భారతదేశాన్ని 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' గా పేర్కొన్నది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు ప్రాధాన్యత కలిగి ఉండాలని చెప్పింది. రాజ్యాంగం ఏడవ షెడ్యూల్‌లో కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలుగా అధికారాలను కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజించింది. కేంద్రం గత పదేళ్లుగా రాష్ట్రాల అధికారాలను తన గుప్పిట్లోకి తీసుకుంటున్నది. జిఎస్‌టి ద్వారా రాష్ట్రాల ఆర్థిక వనరులు కేంద్రం చేతుల్లోకి వెళ్లాయి. జిఎస్‌టి వలన రాష్ట్రాలు రూ.3 లక్షల కోట్లు నష్టపోయాయి. ఆర్థిక సంఘాలు చేసే సిఫార్సులను కేంద్రం తన ఇష్టానుసారంగా అమలు చేస్తున్నది. రాష్ట్ర జాబితాలోగల వ్యవసాయంపై కేంద్రం చట్టాలు చేయడం ఫెడరలిజానికి పూర్తి విరుద్ధం. ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 400 రోజులుపైగా ఆందోళన చేశారు. జాతీయ విద్యావిధానం-2020 కూడా రాష్ట్రాలతో సంప్రదించకుండానే ప్రకటించారు.

సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఇబ్బంది పెడుతున్నది. తమిళనాడు గవర్నర్ రవి అనేక బిల్లులను ఆమోదించక పోవడంతో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రభుత్వాలకు నిధుల మంజూరులో కూడా కేంద్రం వివక్షత చూపుతున్నది. ఫెడరలిజాన్ని సంరక్షించుకుంటేనే దేశ సమైక్యత, సమగ్రత కొనసాగుతుంది.

లౌకికవాదం

భారత రాజ్యాంగం లౌకిక రాజ్యాంగం. ప్రజలకు మత స్వేచ్ఛను కల్పించింది. రాజ్యాంగంలో 25 నుండి 28 నిబంధనలు మత స్వేచ్ఛకు ప్రాతిపదికగా ఉన్నాయి. రాజ్యాంగంలో 29, 30 నిబంధనలు మైనారిటీలకు హక్కులు కల్పించాయి. మైనారిటీలు తమ సంస్కృతి, భాష, లిపి, విద్య మొదలగు వాటిని అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించింది. లౌకికవాదానికి భిన్నంగా ప్రజల మధ్య మతపరమైన విభజన తేవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే 370వ నిబంధన రద్దు చేయడం, మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని కల్పించే 'పౌరసత్వ సవరణ చట్టం' (సిఎఎ) చేయడం మతపరమైన విభజన కోసమే. మైనారిటీ ప్రజల హక్కులపై దాడిలో భాగంగా ఇటీవల 'వక్ఫ్ బిల్లులు' ఆమోదించి మైనారిటీ ప్రజల మనోభావాలు దెబ్బతీశారు. వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళనలు, ప్రదర్శనలు జరుగుతున్నాయి. గోరక్షక దళాల పేరుతో మైనారిటీలు, దళితులపై దాడులు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా 'మతతత్వాన్ని' రెచ్చగొట్టి ప్రజలలో మతపరమైన విభజన తేవటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. చరిత్రను వక్రీకరించి మతపరమైన భావజాలంతో సిలబస్‌ను, పాఠ్యపుస్తకాలను రూపొందిస్తున్నారు. ప్రత్యేకించి మొఘల్ చక్రవర్తుల పరిపాలనపై దాడి చేస్తున్నారు. మొఘలుల చరిత్ర లేకుండా చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. సినిమాల ద్వారా కూడా మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారతదేశానికి లౌకిక స్వభావాన్ని కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉన్నది.


ఏప్రిల్ 14 బి.ఆర్.అంబేద్కర్ జయంతి

జమిలి ఎన్నికలు

నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో జమిలి ఎన్నికల కోసం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాయకత్వాన కమిటీ వేసింది. ఆ కమిటీ జమిలి ఎన్నికలను సిఫార్సు చేసింది. జమిలి ఎన్నికలు రాజకీయ నియంతృత్వానికి దారితీస్తాయని రాజ్యాంగ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. భారతదేశంలో చారిత్రకంగా బహుపార్టీ విధానం రూపుదిద్దుకున్నది. గత 5 దశాబ్దాలుగా భిన్నమైన రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి. కేంద్రంలో ఒక పార్టీ అధికారంలో ఉంటే, రాష్ట్రాలలో భిన్నమైన పార్టీలు ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉంటున్నాయి. భారతదేశంలో ప్రాంతీయ, సామాజిక ఆంక్షలు పెరిగాయి. కార్పొరేట్ శక్తుల అండదండలతో బిజెపిని కేంద్రంలోను, అన్ని రాష్ట్రాలలోను అధికారంలోకి తేవటానికి జమిలి ఎన్నికలు దోహదపడతాయని నరేంద్ర మోడి, అమిత్ షా ద్వయం భావిస్తున్నారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ, ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం.

డీలిమిటేషన్ ప్రక్రియ

ప్రస్తుతం దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చ జరుగుతున్నది. 2026లో లోక్‌సభ నియోజకవర్గాలను జనాభా ఆధారంగా పెంపుదల చేయాలని కేంద్రం ప్రయత్నిస్తున్నది. 1972లో లోక్‌సభ స్థానాల సంఖ్య 543గా నిర్ణయించారు. అప్పటి నుంచి నియోజకవర్గాల పెంపుదల జరగలేదు. గత 5 దశాబ్దాలలో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పద్ధతులను విజయవంతంగా అమలు చేశాయి. విద్య, అక్షరాస్యత, పేదరికం తగ్గుదల మొదలగు విషయాలలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విజయవంతమైనాయి. కానీ బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్నది. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య జనాభా నియంత్రణకు సంబంధించి అసమానతలు ఏర్పడ్డాయి. ఇప్పుడు 2026లో జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఇది సమ న్యాయం, సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. జనాభా నియంత్రణలో విజయవంతమైనందుకు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయి. దీనిపై ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం కృషి చేసి ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతౌల్యత కోసం కృషి జరగాలి.

రాజ్యాంగ వ్యవస్థలపై ఒత్తిడి

గత దశాబ్ద కాలంగా రాజ్యాంగ వ్యవస్థలైన న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వంటి సంస్థలు అనేక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నాయి. సుప్రీంకోర్టు, హైకోర్టులలో 'కొలీజియం' ద్వారా జరుగుతున్న న్యాయమూర్తుల నియామకంలో అనేక లోపాలు బహిర్గతం అయ్యాయి. తమకు నచ్చిన వారిని న్యాయమూర్తులుగా నియమిస్తున్నారు. న్యాయమూర్తులుగా పదవీ విరమణ చేసిన వారిని ఉన్నతమైన పదవులలో నియమిస్తున్నారు. జస్టిస్ రంజన్ గొగోయ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన కొద్ది రోజులలో రాజ్యసభ సభ్యత్వాన్ని పొందారు. ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఎలక్షన్ కమిషన్ పనితీరుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగబద్ధంగా, స్వతంత్రంగా పనిచేయాలి. కానీ గత కొనేళ్లుగా ఎలక్షన్ కమిషన్ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తున్నది.

రాజ్యాంగ ఆధిక్యత ఉండాలి

భారతదేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమైనదని మినర్వా మిల్స్ కేసులో సుప్రీంకోర్టు పేర్కొన్నది. దేశంలో కార్యనిర్వాహక వర్గం, శాసనశాఖ, న్యాయశాఖ, రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి. కాని గత కొన్నేళ్లుగా రాజ్యాంగ సూత్రాలను, ఆశయాలను ఉల్లంఘిస్తూ పాలన జరుగుతున్నది. రాజ్యాంగ ఆధిక్యత ఉండే విధంగా పాలన జరగాలంటే పౌర సమాజం ఒత్తిడి అవసరం.

డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ రచనా సమయం నాటికి 60 దేశాల రాజ్యాంగాలను తులనాత్మక అధ్యయనం చేశారు. వాటిలోని ముఖ్య అంశాలను భారత రాజ్యాంగంలో పొందుపరిచారు. గత 75 ఏళ్లుగా రాజ్యాంగం కాలపరీక్షకు తట్టుకుని నిలబడింది. ప్రస్తుత భారత రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను ఎదుర్కొని...రాజ్యాంగ మౌలిక, లౌకిక స్వభావాన్ని సంరక్షించుకోవడంతో పాటుగా, రాజ్యాంగ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లడమే...డా॥అంబేద్కర్‌కు భారత ప్రజానీకం అర్పించే నివాళి.

/వ్యాసకర్త శాసనమండలి మాజీ సభ్యులు,
సెల్ : 8309965083/

బెంగాల్‌లో వక్ఫ్ ఆందోళనలు హింసాత్మకం

- ముగ్గురు మృతి, పలువురికి గాయాలు
- ఆ చట్టాన్ని అమలు చేయం : మమతా బెనర్జీ

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని పలు ప్రాంతాల్లో వక్ఫ్ (సవరణ) చట్టాన్ని నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఈ హింసాకాండలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మత ఘర్షణల్లో ఇద్దరు మృతి చెందారు. శుక్రవారం సుతిలో జరిగిన పోలీసు కాల్పుల్లో గాయపడిన ఇజాజ్‌షేక్ ముర్షిదాబాద్ మెడికల్ కాలేజి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం చనిపోయారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

దోషులపై కఠిన చర్యలు : సిఎం మమతా బెనర్జీ

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం మాట్లాడుతూ దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆందోళనల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేసేది లేదని ఆమె ప్రకటించారు. ఈ చట్టాన్ని చేసింది కేంద్రమని, రాష్ట్ర ప్రభుత్వం కాదని, తాము దీనికి మద్దతునివ్వడం లేదని మమత తెలిపారు. రాష్ట్రంలో అమలు చేయనప్పుడు ఇక గొడవ దేనికి అని ప్రశ్నించారు.

కొనసాగుతున్న నిరసనలు, 118మంది అరెస్టు

ముర్షిదాబాద్ జిల్లాలో శుక్రవారం హింసాకాండ చెలరేగింది. పోలీసు వ్యాన్లతోసహా అనేక వాహనాలకు నిప్పంటించారు. భద్రతా బలగాలపై రాళ్లు విసిరారు. రహదారులపై ట్రాఫిక్‌ను అడ్డగించారు. ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, హూగ్లీ జిల్లాల్లో శుక్రవారం అల్లర్లు చెలరేగాయి. పోలీసు డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ హింసాత్మక ఘటనలను పోలీసులు చూస్తూ కూర్చోరని అన్నారు. ఇప్పటివరకు 118మందిని అరెస్టు చేశారని తెలిపారు. పుకార్లు, తప్పుడు వార్తలు వ్యాప్తి చేయడం వల్ల సంఘ వ్యతిరేక శక్తులు, కొంతమంది దుండగులు రెచ్చిపోతున్నారని, వారివల్లే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని అదనపు డిజి (శాంతి భద్రతలు) జావేద్ షామిమ్ తెలిపారు. జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున అడ్డంకులు సృష్టించడంతో పోలీసులు రంగంలోకి దిగారని చెప్పారు. సుతి, సంసేర్‌గంజ్ ప్రాంతాల్లో రైల్వే ట్రాకులపై వేలాదిమంది బైఠాయించడంతో రైల్వే సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగింది.

ముర్షిదాబాద్‌లోని జంగీపూర్‌లో దగ్ధమైన వాహనాలు

శాంతిభద్రతలను కాపాడాలి : లెఫ్ట్‌ఫ్రంట్ డిమాండ్

బిజెపి - తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు విభజన రాజకీయాలకు పాల్పడటం, పోలీసులు సకాలంలో జోక్యం చేసుకోకపోవడం వల్లే హింస చెలరేగిందని లెఫ్ట్ ఫ్రంట్ ముర్షిదాబాద్ జిల్లా కన్వీనర్ జమీర్ ముల్లా విమర్శించారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హింసాత్మక ప్రాంతాల్లో శుక్రవారం తమ బృందం పర్యటించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే మత అల్లర్లు జరిగాయని విమర్శించారు. ఇంత జరిగినా శనివారం ఉదయం ధులియన్ బజార్‌లో బిజెపి ర్యాలీకి ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. షంషేర్‌గంజ్, సూతి-2 బ్లాక్‌లో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు సైనిక బలగాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలోనూ, ప్రతి బ్లాక్‌లోనూ అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సుప్రీం తీర్పు సారాన్ని గ్రహించండి

- కేరళ గవర్నర్ వ్యాఖ్యలపై ఎంఎ బేబి

న్యూఢిల్లీ : రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు నిరవధికంగా నిలిపివేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని సారాంశాన్ని అందరు గవర్నర్లు గ్రహించాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విలువలను కాపాడుతుందని చెప్పారు. ఆ తీర్పుకు వ్యతిరేకంగా కేరళ గవర్నర్ చేసిన వ్యాఖ్యలు అవాంఛనీయమైనవని అన్నారు. ఈ తీర్పు రాష్ట్రపతిసహా అందరికీ వర్తిస్తుందని చెప్పారు. కేరళ గవర్నర్ సుప్రీంకోర్టు తీర్పును అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అసెంబ్లీ ఆమోదించిన చట్టాలను అడ్డుకునే అధికారం గవర్నర్‌కు లేదని చెప్పారు. అది లోపభూయిష్టంగా ఉందని మీరు భావిస్తే, మీరు దానిని తిరిగి పంపించాలని చెప్పారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన పార్లమెంటు ఆమోదించిన చట్టాలను రాష్ట్రపతి అడ్డుకోరని గుర్తు చేశారు. "రాష్ట్రపతికి లేని అధికారం గవర్నర్‌కు ఏముంది?" అని ఎంఎ బేబి ప్రశ్నించారు.

వనజీవి రామయ్య మృతి

- ప్రధాని మోడీ ప్రభృతుల సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోటికి పైగా మొక్కలు నాటిన వనజీవి రామయ్య (85) శనివారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. రాత్రి నిద్రించిన ఆయన ఉదయం విగత జీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆర్‌ఎంపికి చూపించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కొంతకాలంగా రామయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కోటికిపైగా మొక్కలు నాటిన వనజీవి రామయ్య, జానకమ్మ దంపతులు చరిత్ర సృష్టించారు. మొక్కలను పెంచాలని చిన్నతనం నుంచే ప్రచారం చేశారు. మొక్కల కోసం దరిపల్లి రామయ్య అలియాస్ వనజీవి రామయ్య జీవితాన్నే త్యాగం చేశారు. దరిపల్లి రామయ్య కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017 మార్చి 30వ తేదీన పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా వనజీవి రామయ్య అవార్డు అందుకున్నారు. రామయ్య మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు. వృక్షో రక్షిత రక్షతః' అనే నినాదాన్ని రామయ్య, జానకమ్మ దంపతులు తమ తలపాగాగా ధరించి పర్యావరణ హితం కోసం పాటుపడ్డారని ప్రధాని కొనియాడారు.

భారత స్నేహితులకు స్వాగతం

- 85వేల వీసాలు ఇచ్చిన చైనా

న్యూఢిల్లీ : భారత్‌కు చైనా స్నేహ హస్తం అందిస్తోంది. విదేశీ పర్యటకులను ఆకట్టుకునేలా.. ముఖ్యంగా భారత పౌరుల ప్రయాణాన్ని సులభతరం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఏప్రిల్ 9 వరకు 85వేల వీసాలు జారీ చేసినట్లు మనదేశంలోని చైనా రాయబారి జు ఫీహాంగ్ వెల్లడించారు. "భారత్‌లోని చైనా ఎంబసీ, కాన్సులేట్లు ఈ ఏడాది ఏప్రిల్ 9 వరకు భారతీయులకు 85వేలకుపైగా వీసాలు జారీ చేశాయి. చైనాను సందర్శించడానికి మరింతమంది భారత స్నేహితులకు స్వాగతం. సురక్షిత, స్నేహపూర్వక, స్ఫూర్తివంతమైన చైనాను ఆన్వేషించండి" అని ఫీహాంగ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మార్చిలో కూడా ఆయన ఈ తరహా పోస్టు చేశారు. అప్పటికే 50వేల వీసాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వీసా ధరలపై తగ్గింపును చైనా మరో ఏడాది పొడిగించిన సంగతి తెలిసిందే. 2025 డిసెంబరు 31 వరకు వీసా ఫీజుల తగ్గింపు కొనసాగుతుందని వెల్లడించింది. చైనాను గతేడాది వీసా ధరలను తగ్గించింది. అప్పటినుంచి సింగిల్ ఎంట్రీ వీసాలకు రూ.2,900, డబుల్ ఎంట్రీ వీసాలకు రూ.4,400 వసూలుచేస్తున్నారు. ఆరు నెలల గడువు ఉండే మల్టిపుల్ ఎంట్రీ వీసాకు రూ.5900, సంవత్సరం, అంతకంటే పైబడి గడువు ఉండే మల్టీ ఎంట్రీ వీసా రూ.8,800 చెల్లించాల్సి ఉంటుంది. గత అక్టోబర్ నుంచి చైనా నుంచి సానుకూల వైఖరి కనిపిస్తోంది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలను తగ్గించుకోవడం కోసం భారత్, చైనా ఆ నెలలోనే కీలక గస్తీ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే.

సార్వత్రిక సమ్మెలో ఆశాలు సైతం

- బిజెపి ఎంపిల ఇళ్లు, కార్యాలయాల ఎదుట నిరసన
- ఆగస్టులో సమ్మెలోకి..
- ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ జాతీయ కన్వెన్షన్‌లో నిర్ణయం

ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ జాతీయ కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న హేమలత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో ఆరోగ్యశాఖ మంత్రి జెపి నడ్డా ప్రకటించిన వేతన పెంపును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఎంపిల ఇళ్లు, కార్యాలయాల ఎదుట ఆందోళనకు ఆశా వర్కర్లు సిద్ధమయ్యారు. మే 20న అఖిల భారత సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొంటారు. ఆగస్టులో సమ్మెకు వెళ్లనున్నారు. ఆశా వర్కర్లు అండ్ ఫెసిలిటేటర్ల సమాఖ్య (ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ) జాతీయ కన్వెన్షన్ శనివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో జరిగింది. 'రెండు దశాబ్దాల ఎన్ హెచ్ఎం సవాళ్లు, పోరాటాలు, విజయాలు, ముందుకు సాగే మార్గం' అనే అంశంపై జరిగిన జాతీయ కన్వెన్షన్‌లో కొనసాగుతున్న పోరాటాలను తీవ్రతరం చేయడానికి నిర్ణయాలు తీసుకుంది.

ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లకు చట్టబద్ధమైన వేతనాలు, సామాజిక భద్రత, పెన్షన్, గౌరవప్రదమైన జీతం, భారతదేశ ప్రజలకు సార్వత్రిక నాణ్యమైన ప్రజా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ హక్కు కోసం పోరాటాలను ప్రకటించింది. సంఘం జాతీయ ఉపాధ్యక్షులు వీణా గుప్తా సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సదస్సును సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత ప్రారంభించారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఆమె వివరించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆశా కార్మికులు చేసిన అద్భుతమైన పోరాటాలను అభినందించారు. తమ పోరాటాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడి, మే 20న జరిగే అఖిల భారత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మే 3న సమ్మె నోటీసు జారీ చేయాలని ఆశాలు నిర్ణయించారు. జిల్లా ప్రధాన కార్యాలయాల్లో సామూహిక ధర్నాలు, జులైలో ఎంపిలకు వినతిపత్రాలు అందజేస్తారు. ఆగస్టులో దేశవ్యాప్తంగా ఆశా కార్మికులు సమ్మె నిర్వహించనున్నారు. ఈ సమావేశ అధ్యక్ష వర్గంలో ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ అధ్యక్షులు పిపి ప్రేమ, వీణా గుప్తా, సునీతా రాణి, డెల్షాడ (జమ్ము కాశ్మీర్), ఆనంది (మహారాష్ట్ర), లోకేష్ రాణి (ఉత్తరాఖండ్), హసుమతి (గుజరాత్) ఉన్నారు. ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ ముసాయిదా డిక్లరేషన్‌ను ప్రవేశపెట్టారు. ఈ సదస్సులో సోదర సంఘాల నాయకులు పి కృష్ణప్రసాద్ (ఎఐకెఎస్), మరియం ధావలే (ఐద్వా) ఆశాల పోరాటాలకు సంఘీభావం, మద్దతు తెలిపారు. ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ అధ్యక్షులు ఉషా రాణి, రాజస్థాన్ ఆశా సంఘం నుండి లీలాబంతి అహరి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లో స్తబ్దత

న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్లలో నెలకొన్న అస్థిరత మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై తీవ్రంగా పడుతోంది. అమెరికా టారిఫ్‌ల దెబ్బకు తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మార్కెట్లలో ఈ ఏడాది మార్చిలో ఈక్విటీ మ్యూచు వల్ ఫండ్ల పెట్టుబడులు రూ.25,082 కోట్లకు తగ్గాయి. ఇది 11 నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఇంతక్రితం ఫిబ్రవరి ఎంఎఫ్ పెట్టు బడుల్లోనూ 14 శాతం పతనం చోటు చేసుకుంది. మరోవైపు గడిచిన మార్చిలో క్రమబద్ధమైన పెట్టుబడులు ఎస్ఐపిలు రూ.25,925 కోట్లకు తగ్గి.. నాలుగు నెలల కనిష్టానికి పడిపోయాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండి యా (ఎఎంఎఫ్ఐ) గణంకాల ప్రకారం.. గడిచిన మార్చిలో ఈక్విటీ ఆధారిత ఎంఎఫ్‌ల్లో రూ.25, 082 కోట్ల పెట్టుబడులు చోటు చేసుకున్నాయి. ఇంతక్రితం ఫిబ్రవరి నెలలో రూ.29,303 కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ 2024లో రూ.18,912 కోట్ల ఈక్విటీ ఎంఎఫ్‌లు చోటు చేసుకోగా.. ఆ తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి.

గవర్నర్లు పంపిన బిల్లులపై 3 నెలల్లోగా నిర్ణయం

- రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు
- వ్యక్తిగత అసంతృప్తులతో బిల్లులను ఆపలేరని స్పష్టీకరణ

న్యూఢిల్లీ : గవర్నర్లు తనకు పంపిన రాష్ట్ర ప్రభుత్వ బిల్లులను ఆమోదించాలా? వద్దా? అని నిర్ణయించుకోవడానికి రాష్ట్రపతికి సుప్రీంకోర్టు కాలపరిమితి విధించింది. రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం గవర్నర్ బిల్లులను నివేదించిన రోజు నుండి మూడు నెలల్లోగా వాటిపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది. ఇలా అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రపతికి గడువు విధించడం ఇదే తొలిసారి. ఈ గడువు మీరి జాప్యం జరిగిన పక్షంలో రాష్ట్రపతి సరైన కారణాలను నమోదు చేయాల్సి వుంటుంది. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాల్సి వుంటుందని ఈ నెల 8న సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. ఈ బిల్లులపై కేంద్రం నుండి ఏవైనా సూచనలు లేదా ప్రశ్నలు వస్తే రాష్ట్రాలు సహకార స్ఫూర్తితో వ్యవహరించాలని పేర్కొంది.

రాజ్యాంగ విరుద్ధమన్న కారణాలతో గవర్నర్, రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం తన వద్దే అట్టిపెట్టుకున్న బిల్లులపై వివేచనతో వ్యవహరించి రాష్ట్రపతి, సుప్రీంకోర్టు సలహాను తీసుకోవాలని జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది.

ఈ మేరకు జస్టిస్ పార్దీవాలా 414 పేజీల తీర్పును రాశారు. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు (ఏప్రిల్ 12) ఈ తీర్పును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. గవర్నర్ తనకు నివేదించిన బిల్లులపై రాష్ట్రపతి, సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం వుందని, ఎందుకంటే రాష్ట్రస్థాయిలో గవర్నర్లకు బిల్లులను రాజ్యాంగ న్యాయస్థానాలకు సలహా లేదా అభిప్రాయం కోసం నివేదించేందుకు ఎలాంటి యంత్రాంగం లేదని పేర్కొన్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన సుప్రీం తన తీర్పులో కీలకమైన వ్యాఖ్యలు చేసింది. నెలల తరబడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తొక్కిపట్టి వుంచడం చట్టపరంగా తప్పు అని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా పొరుగు దేశమైన శ్రీలంకలో నెలకొన్న పరిణామాల గురించి జస్టిస్ పార్దీవాలా ప్రస్తావించారు. శ్రీలంకలో అధ్యక్షుడు బిల్లులపై అభిప్రాయం కోసం సుప్రీంకోర్టుకు నివేదిస్తారని పేర్కొన్నారు. ప్రావిన్షియల్ కౌన్సిల్ చేసిన బిల్లు రాజ్యాంగ విరుద్ధమని గవర్నర్ భావించినట్లైతే ఆయన ఆ బిల్లును అధ్యక్షుడికి నివేదించవచ్చని, ఆయన అవసరమనుకుంటే దాన్ని శ్రీలంక సుప్రీం కోర్టుకు నివేదించవచ్చని తెలిపారు. అటువంటి బిల్లుకు సంబంధించి రాజ్యాంగపరమైన అంశాలను తెలుసుకోవడానికి ఈ చర్య తప్పనిసరని సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొంది. ఆ బిల్లు రాజ్యాంగబద్ధమైనదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేస్తే ఇక గవర్నర్ సమ్మతిని తెలియజేయాల్సిందేనని జస్టిస్ పార్దీవాలా వివరించారు.

బిల్లు చట్టంగా మారడానికి ముందుగా ఆ బిల్లు రాజ్యాంగ చెల్లుబాటుపై సూచనలు లేదా సలహాలు ఇవ్వకుండా రాజ్యాంగ న్యాయస్థానాలను నిలువరించలేం. ప్రతిపాదిత చట్టం గురించి న్యాయ సమీక్ష చేయడం వల్ల అటు ప్రజా వనరులు ఇటు సమయం రెండూ ఆదా అవుతాయి. పైగా అవసరమనుకుంటే సముచితమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి గానూ బిల్లును సమీక్షించేందుకు శాసనసభకు రెండో అవకాశం కూడా వస్తుంది.

వ్యక్తిగత అసంతృప్తులతో రాష్ట్రపతి పరిశీలనకు పంపలేరు

వ్యక్తిగతంగా తనకు అసంతృప్తిగా వుందన్న కారణంతో గవర్నర్, తన వద్దకు వచ్చిన బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య సాంప్రదాయాలు, సూత్రాలు, నిబంధనలకు పెద్ద ముప్పు వస్తుందని భావిస్తేనే కేవలం ఆ కారణాలతోనే బిల్లును రాష్ట్రపతికి నివేదించాల్సి వుంటుందని సుప్రీం పేర్కొంది. అలా నివేదించడానికి గల స్పష్టమైన కారణాలను కూడా వెల్లడించాలని తెలిపింది.

రఫాను చుట్టుముట్టిన ఇజ్రాయిల్ సైన్యం

గాజా : గాజాలోని రఫా నగరాన్ని మొత్తంగా చుట్టుముట్టినట్లు ఇజ్రాయిల్ మిలటరీ శనివారం ప్రకటించింది. గాజాలోని మరిన్ని ప్రాంతాలను కూడా ఇలాగే స్వాధీనం చేసుకుంటామని మిలటరీ బలగాలు వెల్లడించాయి. ఈలోగా పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడ నుండి ఖాళీ చేయాల్సి వుంటుందని స్పష్టం చేశాయి. మార్చి 18న తిరిగి దాడులు మొదలు పెట్టినప్పటి నుండి రఫా వ్యాప్తంగా ప్రజలందరూ ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని మిలటరీ ఆదేశాలు జారీ చేసింది.

సముద్ర తీర ప్రాంతాల్లో వేసిన శిబిరాలకు తరలిపోవాలంటూ సూచించింది. దక్షిణంగా ఈజిప్ట్ సరిహద్దులు కలిగిన 60 చదరపు కిలోమీటర్ల ఈ ప్రాంతాన్ని గల 24గంటలుగా మొత్తంగా తన అధీనంలోకి తీసుకున్న బలగాలు రఫాను ఖాన్ యూనిస్‌తో వేరుచేస్తూ ఒక దారిని వేశారని సైన్యం శనివారం తెలిపింది. ఈ దాడుల కార్యక్రమాలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించ నున్నట్లు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ శనివారం తెలిపారు. దాడులు జరిగే ప్రాంతాల నుండి వెళ్లిపోవాల్సిందిగా ప్రజలను హెచ్చరించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, లొకేటెడ్: 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: 1. మెస్సర్స్ శివ కాటన్ ట్రేడర్స్,** మేనేజింగ్ పార్టనర్: మామిళ్ళపల్లి సాంబశివరావు, డి.నెం: 4-5-26/50, ఫ్లాట్ నెం: బి-4, నరసింహ ఎన్‌క్లేవ్, 2వ క్రాస్, 1వ లైన్, నవభారత్ నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006. **2. శ్రీ మామిళ్ళపల్లి సాంబశివరావు,** తండ్రి: ఎం.సుబ్బారావు, డి.నెం.4-5-26/50, ఫ్లాట్ నెం.బి-4, నరసింహ ఎన్‌క్లేవ్, 2వ క్రాస్, 1వ లైన్, నవభారత్ నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006. **3. శ్రీమతి మామిళ్ళపల్లి విజయ కుమారి,** భర్త: శ్రీ మామిళ్ళపల్లి సాంబశివ రావు, డి.నెం: 4-5-26/50, ఫ్లాట్ నెం.బి-4, నరసింహ ఎన్‌క్లేవ్, 2వ క్రాస్, 1వ లైన్, నవభారత్ నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006. **4. శ్రీ బండి గోపాల్,** తండ్రి: నరసింహారావు, డి.నెం: 4-21-29, 3వ లైన్, చైతన్యపురి కాలనీ, సాయిబాబా రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.2,84,01,005.37** (అక్షరాలా రెండు కోట్ల ఎనభై నాలుగు లక్షల ఒక్క వెయ్యి ఐదు రూపాయల ముప్పై ఏడు పైసలు మాత్రమే) + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 25.05.2021**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారము **తేదీ. 09-04-2025**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.2,84,01,005.37** (అక్షరాలా రెండు కోట్ల ఎనభై నాలుగు లక్షల ఒక్క వెయ్యి ఐదు రూపాయల ముప్పై ఏడు పైసలు మాత్రమే) వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్(8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు క్రింద వివరించబడ్డాయి:

ఐటమ్ నెం-1: గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరు మండలం, ప్రత్తిపాడు సబ్‌జిల్లా, కొర్నెపాడు గ్రామం, డి.నెం: 269/3ఏ వద్ద ఉన్న ఖాళీ భూమి ఎకరా 1.05 సెంట్లు లేదా 0.42 హెక్టర్ల కు **హద్దులు: ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** వాగు (కాలువ), **తూర్పు:** మన్నవ నరసింహరావు గారి భూమి, **పడమర:** చిగురుపాటి సాంబశివరావు గారి భూమి. ఈ హద్దులు మరియు విస్తీర్ణం ఎకరా 1.05 సెంట్లు భూమి మాత్రమే. (రిజిస్టర్డ్ పార్టిషన్ డీడ్ డాక్యుమెంట్ నెం: 1016/2013, తేదీ: 15.03.2013 & రెక్టిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2461/2013, తేదీ: 12.06.2013, మామిళ్ళపల్లి సాంబశివరావు గారి పేరున కలదు) గూగుల్ కోఆర్డినేట్స్: 16.246972, 80.389639.

ఐటమ్ నెం-2: గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరు మండలం, ప్రత్తిపాడు సబ్‌జిల్లా, కొర్నెపాడు గ్రామం, డి.నెం.295/సిలో ఖాళీ భూమి ఎకరా 1.30 సెంట్లు మరియు ఖాళీ భూమి ఎకరా 1.26 సెంట్లు రెండు నెంబర్లలో కలిగి ఉన్న ఒకే భూమి ఎకరా 2.56 సెంట్లు లేదా 1.03 హెక్టర్ల విస్తీర్ణంకు **హద్దులు: ఉత్తరం:** గొరిజవోలు రమాదేవి గారి భూమి, **దక్షిణం:** పొనకల శ్యామలాంబ గారి భూమి, **తూర్పు:** ఉప్పుటూరి సాంబశివరావు గారి భూమి, **పడమర:** మన్నవ రేణుకాదేవి గారి భూమి. (మామిళ్ళపల్లి సాంబశివరావు గారి పేరున గల రిజిస్టర్డ్ పార్టిషన్ డీడ్ డాక్యుమెంట్ నెం:1016/2013, తేదీ: 15.03.2013 & రెక్టిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నెం: 2461/2013, తేదీ: 12.06.2013). గూగుల్ కోఆర్డినేట్స్: 16.248408, 80.394486.

ఐటమ్ నెం-3: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్‌జిల్లా, గుంటూరు న్యూ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, ఏటుకూరు గ్రామంలో డి.నెం: 4, ఫ్లాట్ నెం: 4లో 971.83 చ.గ.లు లేదా 812.54 చ.మీ.ల విస్తీర్ణంలో ఖాళీగా ఉన్న నివాస పట్టణ భూమికి **హద్దులు: ఉత్తరం:** కారం మిల్ గోడ, **దక్షిణం:** 36 అడుగుల వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం: 6, **పడమర:** ప్లాట్ నెం: 2. ఈ హద్దులు మరియు విస్తీర్ణం 971.83 చ.గ.ల భూమి మాత్రమే (మామిళ్ళపల్లి విజయకుమారి పేరున గల రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం: 10329/2014, తేదీ: 15.03.2013 & రెక్టిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నెం: 2461/2013, తేదీ 12.06.2013). గూగుల్ కోఆర్డినేట్స్: 16.271165, 80.422284

తేది: 09-04-2025
ప్రదేశము: విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

HDFC BANK
We understand your world

డిపార్ట్‌మెంట్ ఫర్ స్పెషల్ ఆపరేషన్స్
నెం.50-96-5, ప్లాటు నెం.175, సీతమ్మధార,
పాత ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

ముందస్తు అమ్మకం ప్రకటన

Ref. No.HDFC/DFSO/2025-26/1 తేది.02.04.2025

టు,

1) **మెస్సర్స్ శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ శ్రీ గూడె రాంబాబు,** ప్లాట్ నెం.184 & 185, ఆర్ ఎస్ నెం.490/1, శ్రీశైలం కాలనీ రోడ్డు, గొల్లపూడి, విజయవాడ-521225.
2) **శ్రీ గూడె రాంబాబు, తండ్రి. శ్రీ నరసింహారావు గూడె,** డోర్ నెం.1-48, దుగ్గిరాలపాడు, జి. కొందూరు, విజయవాడ, కృష్ణా జిల్లా-521229.
3) **శ్రీమతి గూడె రాధా రాణి, భర్త. గూడె రాంబాబు,** డోర్ నెం.1-48, దుగ్గిరాలపాడు, జి. కొందూరు, విజయవాడ, కృష్ణా జిల్లా-521229.

శ్రీ/శ్రీమతి,

Ref : తేది.18.03.2024 నాటి సర్ఫేసి యాక్ట్, 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద నోటీసు
Ref : స్వాధీనత నోటీసు తేది : 31.05.2024
Ref : మెస్సర్స్ శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీస్

విషయం : సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) ప్రకారం స్థిరాస్తి యొక్క అమ్మకం ప్రకటన

మేము, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, సెక్యూర్డ్ క్రెడిటార్‌గా, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ యొక్క సెక్షన్ 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ - 2002 (సర్ఫేసి యాక్ట్ - 2002) ప్రకారం సెక్షన్ 13 క్రింద పైన పేర్కొన్న చట్టంలోని అధికారాలను నియమాలను మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 రూల్ 3 ప్రకారం సంబంధిత అధీకృత అధికారి ద్వారా సెక్షన్ 13(2) ప్రకారం మీకు మా ఖాతాలో ఉన్న బకాయి మొత్తంచెల్లించమని **తేది.18.03.2024** డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. కావున చిరునామాదారులు మా ఖాతాలో ఉన్న ఋణం మొత్తం వడ్డీతో సహా 60 రోజులలోపు తిరిగి చెల్లించమని డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

ఖాతాలో పేర్కొన్న చిరునామాదారులైన మీరు పలుమార్లు నోటీసు పంపిన మీరు నోటీసు నిర్లక్ష్యం చేసి చెల్లించడంలో విఫలమయ్యారు. కావున మీరు ఋణం తీసుకున్నప్పుడు మీరు సంతకం చేసిన నియమ నిబంధనలు సర్ఫేసి చట్టం రూల్ 13(4) సెక్షన్ ప్రకారం నోటీసును ఇచ్చ ఉన్నారు మరియు సర్ఫేసి చట్టం రూల్ 8(3) ప్రకారం **తేది.31.05.2024 న** సెక్యూర్డ్ ఆస్తి / ఆస్తిని జప్తు / స్వాధీనం చేసుకోబడును. సర్ఫేసి చట్టం 2002 ప్రకారం స్వాధీన నోటీసు 8(1) మరియు 8(2) యొక్క నియమ నిబంధనలు వర్తించబడును. పైన పేర్కొన్న చట్టంనకు బ్యాంకు లోబడి ఉంటుంది.

స్థిరాస్తుల యొక్క వివరములు

ఆస్తి-1 : విజయవాడ-520010, పటమట, కె.పి.నగర్, వార్డు నెం.8 (పన్ను రసీదు ప్రకారం), అసెస్‌మెంట్ నెం.1073134285, ఎల్.పి నెం.15/1979, ఆర్.ఎస్.నెం.127/2, ప్లాట్ నెం.19 (ప్రస్తుత ప్లాట్ నెం.59) వద్ద గల విస్తీర్ణం 430 చ॥గ॥లు లేదా 2145.60 చ॥అ॥లులోని డోర్ నెం.59ఎ-11-3/1 తో ఉన్న నివాసయోగ్యమైన ఆస్తి. **(శ్రీ గూడె రాంబాబు & శ్రీమతి గూడె రాధా రాణి గార్ల పేరున గల ఆస్తి దస్తావేజు నెం.7273/2020, తేది.26.11.2020 ఎస్.ఆర్.ఓ పడమట ప్రకారం) దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం :** పాతూరి శివ వరప్రసాద్ గారి ఆస్తి (ప్లాట్ నెం.18), **దక్షిణం :** పరిమి నాగేంద్రబాబు గారి ఆస్తి (ప్లాట్ నెం.20), **తూర్పు :** పునుకొల్లు లక్ష్మణ రావు గారి ఆస్తి (ప్లాట్ నెం.31), **పడమర :** 30 అ॥ల మున్సిపల్ రోడ్డు.

ఆస్తి-2 : కృష్ణా జిల్లా-521225, విజయవాడ, ఇబ్రహీంపట్నం ఎస్.ఆర్.ఓ, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి, గొల్లపూడి గ్రామ పంచాయితీ ఏరియా వద్ద గల ఇంటి స్థలం యొక్క ఆర్.ఎస్.నెం.529 & 530/1 లోని స్థలం అన్ని సాధారణ ఉపయోగాలతో 100.00 చ॥అ॥ల కార్ పార్కింగ్‌తో కలదు మరియు ఆర్ ఎస్ నెం.529, అసెస్‌మెంట్ నెం.7913, దస్తావేజు నెం.643/2016 లోని విస్తీర్ణం 1456 చ॥అ॥లుతో "వడ్లమూడి ప్లాజా", చిన్నిత బ్లాక్, రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.సి-302 డోర్ నెం. 22-84/2 తో ఉన్న నివాసయోగ్యమైన ఆస్తి. **డాక్యుమెంట్ హోల్డర్ శ్రీ గూడె రాంబాబు. హద్దులు : ఉత్తరం :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **తూర్పు :** కామన్ కారిడార్, **పడమర :** ఓపెన్ టు స్కై.

ప్రతిపాదిత ప్రకారం నియమాలకు అనుసరించి సంతకం చేసిన వారి యొక్క స్థిర, చర మరియు తనఖా ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయిస్తారు.

పైన పేర్కొన్న నోటీసు ప్రకారం ఖాతాదారుని స్థిరాస్తిని ఈ క్రింద పేర్కొన్న రూల్ 8(5) ప్రకారం ఏదో ఒక నియమాన్ని అనుసరించి నోటీసు తేదీ నుండి సరిగ్గా 30 రోజుల తరువాత అమ్మకానికి ఉంచబడును. ఖాతాలో చిరునామాదారులకు నోటీసు ఇవ్వబడింది.

ఎ) ఇదేవిధమైన ఆస్తులతో వ్యవహరించు వారు లేదా ఆస్తులను కొనుగోలు చేయుటయందు ఆసక్తిగల వారి నుండి కొటేషన్‌లు ఆహ్వానించుట; లేదా, **బి)** ప్రజల నుండి టెండర్లు ఆహ్వానించుట; లేదా, **సి)** ఇ-పద్ధతితో సహా బహిరంగ వేలం నిర్వహించుట; లేదా, **డి)** ప్రైవేట్ ట్రీటీ.

దయచేసి ఖాతాలో చిరునామాదారులు దృష్టికి ఈ నోటీసును వినియోగించినప్పుడు మీ యొక్క తనఖా మొత్తం బకాయిలు వడ్డీతో సహా మరియు బ్యాంక్ ఖర్చులతో పాటు మీరు చెల్లించవలసిన మొత్తం బకాయిలను టెండరు చేయవచ్చును. సర్ఫేసి చట్టంలో పేర్కొనబడిన సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) ప్రకారం నోటీసులో వివరించిన ప్రకారం ఆస్తుల విక్రయానికి కొటేషన్లు పిలవడానికి ముందు, టెండర్లు ఆహ్వానించడానికి ముందు, వేలం వేయడానికి ముందు, ప్రైవేట్ ఒప్పందాలు జరపడానికి నోటీసు ప్రచురించే తేదీకి ముందు ఎప్పుడైని మీరు బకాయిలు మొత్తం చెల్లించవచ్చును. అలా కానిచో బ్యాంక్ నుండి మీ సెక్యూర్డ్ ఆస్తులను రీడీమ్ చేయడానికి మీరు అర్హత ఉండదని దయచేసి గమనించగలరు.

ఖాతాలో చేరిన చిరునామాదారులు **తేది.29.02.2024 నాటికి మీరు చేసిన మొత్తం రూ.5,84,41,617.67 పై (అక్షరాల ఐదు కోట్ల ఎనభై నాలుగు లక్షల నలభై ఒక్క వేల ఆరు వందల పదిహేడు రూపాయల అరవై ఏడు పైసలు మాత్రమే)** తదుపరి వడ్డీతో సహా నోటీసు ఇచ్చిన తేదీ వరకు మొత్తం చెల్లించమని కోరడమైనది. నోటీసులో పేర్కొన్న కాలపరిమితి దాటిన యెడల మీరు కోరిన విధంగా బకాయిలను చెల్లించడంలో విఫలమైనచో హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ వారి ఇష్ట ప్రకారం వారి యొక్క ఆసక్తి అనుసరించి మీ యొక్క సెక్యూర్డ్ ఆస్తుల విక్రయానికి కొనసగించడానికి స్వేచ్ఛను కలిగి ఉంటారు. మీరు ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోపు చెల్లించని పక్షంలో బ్యాంక్ పైన పేర్కొన్న పద్ధతిలో ఆస్తిని విక్రయించబడును.

బ్యాంకుకు అందుబాటులో ఉన్న ఇతర హక్కులు & ఆక్షేపణలకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఈ నోటీసు మీకు జారీ చేయబడుతుందని దయచేసి గమనించగలరు.

స్థలం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,

AXIS BANK LIMITED
రిటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/ బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, లోన్ సెంటర్, గ్రౌండ్ ఫ్లోర్, 16-6-238, 2వ వీధి, శ్రీనివాస అగ్రహారం, నెల్లూరు-524001

రూల్-8(1) క్రింద స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (పూర్వం యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడినది) యొక్క అధీకృత అధికారి, దీని రిజిస్టర్డు ఆఫీస్:"త్రిషుల్", సామర్తేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006, ఇతర దీని బ్రాంచ్ ఆఫీసు: **రిటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/ బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, లోన్ సెంటర్, గ్రౌండ్ ఫ్లోర్, 16-6-238, 2వ వీధి, శ్రీనివాస అగ్రహారం, నెల్లూరు-524001 (మొబైల్)** + 91-9014456781 వద్ద కలిగియుండి మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద మరియు **SARFAESI** చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీత / హామీదారులు / తనఖాదారులను కోరుతూ **డిమాండ్ నోటీసు** జారీచేయబడినది.

క్ర. సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు/హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	ఈక్విటబుల్ తాకట్టుకు ఆఫర్‌చేసిన ఆస్తి మరియు స్వాధీనతా తేది
1	1) **శ్రీమతి తాళ్లూరి హేమలత రాణి భర్త టి. రవి కుమార్,** ఇంటి నెం: 1-62-21, సెక్టార్-2, ఎంవిపి కాలనీ విశాఖపట్నం (అర్బన్) ఆం.ప్ర-530017. 2) **శ్రీ తాళ్లూరి రవి కుమార్** తండ్రి తాళ్లూరి సైదయ్య, ఇ.నెం.1-62-21, సెక్టార్-2, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం (అర్బన్) ఆం.ప్ర-530017 **డిమాండ్ నోటీసు తేదీ: 09-07-2024 రుణ ఖాతా నెంబరు : 921030006567447 & 921030006567450**	**రూ.33,81,027/-** (రూపాయలు ముప్పైమూడులక్షల ఎనబైఒకవేల ఇరవైఏడు మాత్రమే)	డాక్యుమెంట్ నెం: 2628/2009, తేదీ: 25.09.2009 నందిగామ ఎస్ఆర్ఓ ఆధారంగా శ్రీమతి తాళ్లూరి హేమలత రాణి వారిపేరునగల నందిగామ గ్రామం, నందిగామ గ్రామ పంచాయతీ పరిధి, నందిగామ మండల పరిధిలో, సబ్ రిజిస్ట్రార్ నందిగామ, కృష్ణా జిల్లా పరిధిలోని డోర్ నెం.22-42 కలిగిన విస్తీర్ణం 242 చ.గ.ల విస్తీర్ణపు అసెస్‌మెంట్ నెం: 2888, మరియు సర్వే నెం.671, ఆర్‌సిసి రూఫ్ బిల్డింగ్‌గల ఆస్తి మొత్తం భాగం మరియు **సరిహద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం. 69లోని స్థలం, **ఉత్తరం:** గురునాథం ఇల్లు, స్థలం. **స్వాధీనతా తేదీ: 09-04-2025.**

తేది: 13-04-2025
ప్రదేశం: నందిగామ
సం/- అధీకృత అధికారి,
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

మీకోసం

రసం పిండిన నిమ్మ చెక్కలతో కత్తులు, కత్తిపీటలు రుద్దితే వాటికి అంటుకున్న ఉల్లిపాయ వాసన పోతుంది.

జీవన సౌరభం

ప్రయత్నాలను, పోరాటాలను.. పిరికివాళ్లు మొదలుపెట్టరు, బలహీనులు పూర్తిచేయరు. విజేతలు విడిచిపెట్టరు.

పాలకూర కట్ట

'రవీ! ఈ ఇరవై రూపాయలతో కూరగాయల మార్కెట్‌కు వెళ్లి పాలకూర తీసుకురావా?' అని వంటింట్లో నుంచి రవి అమ్మ చెప్పింది. 'అలాగే అమ్మా!' అని రవి చేతి సంచి తీసుకుని మార్కెట్‌కు వెళ్ళాడు. ఎప్పుడూ ఆకుకూరలు కొనే కొట్టు వద్ద అవ్వకు బదులు ఒక అమ్మాయి ఉంది. రవి ఆ అమ్మాయి దగ్గర పాలకూర కొని ఇంటికి వచ్చాడు.

'రవీ! ఏంటి ఈ పాలకూర కట్టకు కట్టిన తాడులో ఎనభై రూపాయలు ఉన్నాయి' అని అంది రవి అమ్మ. 'నాకు తెలియదమ్మా! ఏదో పొరపాటు జరిగి ఉంటుంది. ఆ డబ్బు ఇలా ఇవ్వు. మార్కెటుకు వెళ్ళి వస్తాను' అని పరుగు తీశాడు రవి. అక్కడ అమ్మాయికి బదులు అవ్వ ఉంది. 'అవ్వా! ఇందాక ఇక్కడ ఉన్న అమ్మాయికి ఇరవై రూపాయలు ఇచ్చి పాలకూర తీసుకెళ్లాను. ఆ ఆకు కూరకు కట్టిన తాడులో ఈ ఎనభై రూపాయలు ఉన్నాయి' అని అవ్వకు ఇచ్చాడు.

'బాబూ ఇందాక ఒక సార్! పాలకూర తీసుకుని వంద రూపాయల నోటు ఇచ్చారు. అప్పటికి నా వద్ద చిల్లర లేదు. ఆయన మళ్ళీ వస్తాను అని చెప్పి వెళ్ళిపోయారు. కాసేపటికి నాకు చిల్లర వచ్చింది. నా మానవరాలికి ఆ సార్ వస్తే ఈ కట్ట ఇవ్వు అని డబ్బులు కట్టిన ఆకు కూర కట్టను చూపించి, టిఫిన్ తిందామని వెళ్ళాను. ఈ లోగా పొరపాటు జరిగింది. డబ్బు తెచ్చి ఇచ్చినందుకు చాలా సంతోషం నాయనా! నువ్వు చల్లగా ఉండాలి' అంది అవ్వ.

ఇంటికి వెళ్ళిన రవి స్కూలుకి వెళ్లాడు. మూడో పీరియడ్‌లో తరగతి గదికి వచ్చిన తెలుగు మాస్టారు 'పిల్లలూ ఈ రోజు ఒక తమాషా జరిగింది. నేను ఆకుకూర కొనడానికి వెళ్ళాను' అని మాస్టారు చెప్పే లోపే 'ఒక్క నిముషం మాస్టారు' అని రవి మార్కెట్లో జరిగిందంతా చెప్పాడు. 'ఆ డబ్బు నీకు దొరికిందా? దొరికిన డబ్బును తిరిగి ఇవ్వడం అన్నది మంచి లక్షణం. ఆ డబ్బు నాకు అందింది. పిల్లలూ రవి చేసిన పనికి చప్పట్లు కొట్టండి!' అన్నారు మాస్టారు. అందరూ చప్పట్లు కొట్టారు. 'మీకు కూడా ఇలాంటి సంఘటనలు ఎదురైతే రవిలా మంచి పని చేయండి' అన్నారు మాస్టారు. 'అలాగే సర్!' అన్నారు పిల్లలు.

- యు.విజయశేఖర రెడ్డి, హైదరాబాద్.

నేను గీసిన బొమ్మ

బి. జ్ఞాన్వి, యుకేజీ,
శ్రీ చైతన్య స్కూలు,
సిద్ధిపేట.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రంగస్థల నటరాజు 'గోపరాజు'

రంగస్థలంలో రాణించి బుల్లితెర.. ఆపై వెండితెరపై అలరిస్తున్న క్యారెక్టర్ ఆర్టిస్టులు చాలామంది ఉన్నారు. 65 సినిమాల్లో నటించినా నేటికీ నాటకరంగ ప్రస్థానాన్ని వదలకుండా వెండితెరపై తన మార్కు నటన ప్రదర్శిస్తున్న నటులు గోపరాజు రమణ. గంభీరమైన కంఠం.. నిండైన విగ్రహం.. ఆజానుబాహుడైన ఆయన్ను చూడగానే 'మిడిల్‌క్లాస్' సమాజం కనబడుతుంది. టాలీవుడ్ హీరోలకు తండ్రిగా ఆయన తన నట ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. మాటలో స్పష్టత, వాచకంలో విభిన్నత, అహర్యంలో జీవించేతత్వం.. మాటలో మాధుర్యం.. నటనలో వైవిధ్యంతో టాలీవుడ్‌లో ఫాదర్ రోల్‌కు కేరాఫ్‌గా ఆయన నిలుస్తున్నారు.

73 ఏళ్ల వయస్సులోనూ ఆయన తనకు వచ్చిన పాత్రల్లో నటిస్తూ నటనలో సరికొత్త వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆయన నటించిన సినిమాలు సింహభాగం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచినవే. గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన గోపరాజు యజ్ఞేశ్వర వెంకట రమణమూర్తి (గోపరాజు రమణ). రంగస్థల, బుల్లితెర, వెండితెర నటుడిగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆయన సుపరిచితులు. ఆయన గ్రహణం (2004)లో వచ్చిన సినిమాతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రంగ ప్రవేశం చేశారు. ఆయన జీవితాన్ని మలుపు తిప్పిన చిత్రం మిడిల్‌క్లాస్ మెలోడీస్ (2020). ఈ చిత్రం ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాలో నటన కూడా బాగా మెప్పించింది. సినిమాల్లో నటించక ముందు అనేక నాటకాల్లో నటించారు.

మిడిల్‌క్లాస్ మెలోడీస్‌తో సరికొత్త గుర్తింపు

మిడిల్‌క్లాస్ మెలోడీస్ సినిమాలో ఆనంద్ దేవరకొండ తండ్రిగా కొండలరావు పాత్ర అదరగొట్టేశారు. అద్భుత నటనతో మధ్య తరగతి ప్రజల వెతలను జొప్పించారు. 1996లోనే ఇండస్ట్రీలోకి వచ్చి చాలా సినిమాల్లో నటించారు. కానీ తనకు తగ్గ పాత్ర రాలేదు. మిడిల్ క్లాస్ మెలోడీస్ మాత్రం ఆయన దశను, దిశను మార్చేసింది. ఆ సినిమా నుంచి ఆయన బాగా బిజీ అయిపోయారు. 73 సంవత్సరాల వయస్సులోనూ ఆయన నటుడిగా బిజీగా ఉన్నారు. పాఠశాల విద్య స్థాయిలోనే తన కెరీర్‌ను నటుడిగా నాటక రంగంలో ప్రారంభించారు. తెలుగు మాస్టారు పిన్నక వెంకటేశ్వరరావు ప్రోత్సహించటంతో.. పాఠశాలలో లోయర్, హయ్యర్ విభాగాల్లో పోటీలు జరిగేవి. తొలి ప్రదర్శనతోనే రమణ బహుమతిని అందుకోవటంతో మాస్టారు మరింతగా ప్రోత్సహించారు. ఆ తర్వాత ఆవుల సాంబశివరావు రాసిన 'మానవుని అడుగుజాడల్లో' నాటకంలో 'విష్ణుమూర్తి'గా నటించి మెప్పించారు. ఇందులో నటనకు ఆయన ఉత్తమ బహుమతి కూడా లభించింది. 1967లో బాలానంద సంఘం నల్లకుంట అనే నాటక సంస్థలో చేరి అక్కడ సక్కుబాయి, స్ట్రైక్, పాలిష్ భయ్యా వంటి నాటకాల్లో నటించారు. ఆ తర్వాత కాలంలో ఆలిండియా రేడియోలో అనేక నాటకాల్లో కూడా పాల్గొన్నారు. 1994 నుంచి టెలివిజన్ రంగంలో నటించడం ప్రారంభించారు. బామ్మ గారి మరచెంబుతో ప్రారంభించి పద్మవ్యూహం, ముద్దమందారం, మహాలక్ష్మి, చిన్న కోడలు ... ఇలా పలు సీరియల్లలో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్న క్యారెక్టర్ నటుడు గోపరాజు రమణ.

ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే....

రమణ కుటుంబం తాతముత్తాతల నుంచి కరణీకం చేసేవారు. ఇదే వారసత్వాన్ని ఆయన కూడా అందుకున్నారు. రెండో అక్క తెలుగు పండితురాలు కావటంతో ఆమె కూడా నాటకాలను ప్రోత్సహించేవారు. అంబి, పురుషోత్తముడు, నేరస్తుడు ఎవడు? వంటి ఏకాంకిక నాటికలను మూడో అక్కయ్య, అన్నయ్యతోపాటుగా ఆయనతోపాటుగా చదువుకునే మరికొందరు మొత్తంగా 10 మందికిపైగా ఒక బృందంగా ఏర్పడి నాటకలు, నాటిక ప్రదర్శనలు మూడేళ్లపాటు చేశారు. ఆ తర్వాత అక్క హైదరాబాద్‌కు ఉద్యోగం రీత్యా వెళ్లిపోయారు. ఆయన చదువుకు ఆటంకం ఏర్పాటుతుందని భావించి తనతోపాటు హైదరాబాద్ తీసుకెళ్లారు. 1964లో నల్లకుంట బాలానంద సంఘంలో చేర్పించారు. అక్కడ జమ్మలమడక పూర్ణచంద్రరావు (సెక్రటరీగా) నిరంతరం నాటకాలు వేస్తుండేవారు. దసరా, ఇతర పండుగల సమయంలో నాటక ప్రదర్శనలు బాగా జరిగేవి. దసరా కాంపిటేషన్‌లో 'పాలిష్‌బయ్య' నాటిక ప్రదర్శించగా ఆయనకు ఉత్తమ విలన్ అవార్డుకు ఎంపికయ్యారు. రేడియో అక్కయ్య, అన్నయ్య గారి ఇంటి వద్ద కాంపిటేషన్స్ జరిగేవి. టాం షాయర్ ఇంగ్లీష్ నాటకం తెలుగు ధారావాహిక, సక్కుబాయి వంటి వాటిలో నటించారు. ఆ తర్వాత 1969లో కొలకలూరు తిరిగి వచ్చేశారు. 1970లో కరణికం పరీక్ష రాయగా రెవెన్యూ విభాగంలో గ్రామాధికారిగా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే, తోటి మిత్రులు, గ్రామ ప్రజలు ప్రోత్సాహంతో మళ్లీ నాటక ప్రదర్శనలు ప్రారంభించారు. అప్పట్లో ఏడాదికి మూడు నుంచి నాలుగు వరకూ ప్రదర్శనలు ఇచ్చేవారు. 1984 ప్రాంతంలో శివరాత్రి, ఇతర పండుగల సమయంలో నాటక ప్రదర్శనలు చేసేవారు. అప్పట్లో తలో కొంత చందాలు వేసుకుని వీటిని నిర్వహించేవారు. ఒక్కోసారి మిగతా కళాకారులకు ఇవ్వాల్సిన మొత్తాల కోసం ఉంగరాలు తాకట్టు పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

'శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు'తో ...

అనంతరం 'శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు' కళాపరిషత్‌ను రమణ 1990లోనే ఏర్పాటు చేశారు. ఆరిశెట్టి శివన్నారాయణ నాటక రచనలు చేస్తే వీరి దర్శకత్వంలో తన రెండో కుమారుడు విజయ్, మరి కొంతమంది కళాకారులతో 2008 వరకు వందలాది ప్రదర్శనలు ప్రదర్శించారు. ఆ తర్వాత నుంచి విజయ్ సంస్థ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. విజయ్ దర్శకత్వంలో 15 నాటికలు, ఆరు నాటకాల్లో ఆర్టిస్ట్‌గా రాణించి ఉత్తమ నటుడు నంది కైవసం చేసుకున్నారు. రి

వెండితెరపై 'మిడిల్‌క్లాస్'కు ప్రతిరూపం

వెండితెరపైకి వచ్చి 'గ్రహణం'

'మాయాబజార్', 'గోల్కొండ హైస్కూల్', 'అష్టాచెమ్మా', 'గౌతమీపుత్ర శాతకర్ణి' వంటి సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో కనిపించారు. ఆ పాత్రలు ఆయన ఆశించినంత ఫలితాన్ని అందించలేకపోయాయి. 'మిడిల్‌క్లాస్ మెలోడీస్' సినిమాలోని కొండలరావు పాత్ర ఆ లోటు భర్తీ చేసి, ఆయన గురించి అటు చిత్ర పరిశ్రమ- ఇటు ప్రేక్షకులు చర్చించుకునేలా చేసింది. దాని తర్వాత వరుస అవకాశాలు అందుకున్నారు. 'ఎఫ్ 3' 'బెదురులంక 2012' రంగబలి, జనక అయితే గనక, స్వాగ్, కమిటీ కుర్రాళ్ళు, ఇలా ఎన్నో చిత్రాల్లో విభిన్న పాత్రలతో సందడి చేశారు.

- యడవల్లి శ్రీనివాసరావు

మరింత ప్రోత్సాహించారు

ఉద్యోగ నిమిత్తం 1998లో హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత రమణాచారి, చాట్ల శ్రీరాములు, దుగ్గిరాల, నాగభూషణ శర్మ గార్లు రసరంజని సంస్థ ద్వారా ఆయన్ను చేర్చుకున్నారు. చాలా నాటకాలు ఆడించారు. ఆయనకు నాటకాలు నేర్పిన దర్శకులు 60 మంది వరకూ ఉన్నారు. రత్నగిరి రావు, బొల్లిముంత కృష్ణ, మక్కపాటి కృష్ణమోహన్, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, గుమ్మడి గోపాలకృష్ణ, డి.ఎస్.ఎన్.మూర్తి, కోట్ల హనుమంతరావు గార్లు తమ నాటికల్లో ప్రముఖ పాత్ర ఇచ్చి మరింత ప్రోత్సహించారు.

- గోపరాజు రమణ, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్

ప్రభుత్వ కళాశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం 50,314 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 23,799 మంది (47 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గడిచిన పదేళ్లలో రెండో అత్యధిక శాతంగా ఉంది. రెండో సంవత్సరం 39,783 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 27,276 మంది (69 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక ఉత్తీర్ణతగా నమోదైంది. 2,257 ప్రైవేటు కళాశాలల నుంచి 3,85,501 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తే 74 మంది ఉత్తీర్ణత సాధించగా, రెండో సంవత్సరం పరీక్షల్లో 3,42,781 మంది పరీక్షలు రాస్తే 85 శాతం ఉత్తీర్ణులయ్యారు. హైస్కూల్ ప్లస్‌లో మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం బాగా తక్కువగా నమోదైంది. మొదటి సంవత్సరంలో 34 శాతం, రెండో సంవత్సరం పరీక్షల్లో కేవలం 60 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎపి సాంఘిక సంక్షేమశాఖ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మొదటి సంవత్సరంలో 86 శాతం, రెండో సంవత్సరంలో 94 శాతం ఉత్తీర్ణత సాధించగా, కెజిబివిల్లో మొదటి సంవత్సరంలో 69 శాతం, రెండో సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 80 శాతం, రెండో సంవత్సరంలో 91 శాతంగా, బిసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 92 శాతం, రెండో సంవత్సరంలో 97 శాతం ఫలితాలు సాధించారు. ఎపి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 90 శాతం, రెండో సంవత్సరంలో 96 శాతం ఫలితాలు నమోదయ్యాయి.

గ్రూపుల వారీ ఉత్తీర్ణత శాతాలు

గ్రూప్ పేరు	ఫస్టియర్	సెకండియర్
ఎంపిసి	77	86
బైపిసి	72	83
సిఇసి	42	69
హెచ్ఇసి	37	61
ఎంఇసి	74	83
ఇతర గ్రూపులు	44	64

కృష్ణా జిల్లాకు ప్రథమ స్థానం

ఇంటర్ ఫలితాలను జిల్లాల వారీ పరిశీలిస్తే మొదటి, రెండో సంవత్సరాల ఫలితాల్లో కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 23,219 పరీక్ష రాయగా, 19,743 మంది ఉత్తీర్ణులవడంతో 85 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, గుంటూరు జిల్లా 32,613 మంది పరీక్షలు రాస్తే 26,872 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో 82 శాతం ఉత్తీర్ణతతో గుంటూరు జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. చిత్తూరు జిల్లాలో 13,183 మంది పరీక్షలు రాయగా, 7,168 మంది (54 శాతం) ఉత్తీర్ణులవడంతో చివరి స్థానంలో నిలిచింది. రెండో సంవత్సరంలో కృష్ణా జిల్లాలో 19,133 మంది పరీక్షలు రాస్తే, 17,708 మంది ఉత్తీర్ణులు కావడంతో 93 శాతం ఫలితాలతో ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లాలో 28,231 మంది పరీక్షలు రాస్తే 25,646 మంది ఉత్తీర్ణులవడంతో 91 శాతం ఫలితాలు సాధించి ద్వితీయ స్థానంలో ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 5,190 మంది పరీక్షలు రాస్తే 3,786 ఉత్తీర్ణులవడంతో 73 శాతం ఫలితాలు సాధించి చివరి స్థానానికి పరిమితమైంది.

ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు భేష్

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రైవేటు కళాశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. దీంతో మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఫలితాలు భేష్‌గా ఉన్నాయని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గత పదేళ్లలో లేని విధంగా ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగిందని, జూనియర్ కళాశాలల్లో ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం తీసుకున్న చర్యలే ఇందుకు కారణమన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 47 శాతం, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 69 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో పార్వతీపురం మన్యం జిల్లా 70 శాతం ఫలితాలు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, విశాఖ జిల్లా 34 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచిందన్నారు. రెండో సంవత్సరం పరీక్షల్లోనూ పార్వతీపురం మన్యం జిల్లా 81 శాతం ఫలితాలు సాధించి ప్రథమ స్థానంలోనూ, విశాఖపట్నం జిల్లా 55 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఇంటర్ ఒకేషనల్ ఫలితాల్లోనూ గత పదేళ్లతో పోలిస్తే రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సుల్లో మొదటి ఏడాదిలో 64 శాతం ఉత్తీర్ణత సాధించగా, రెండవ సంవత్సరంలో 82 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలను అందించామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేశామని తెలిపారు. కళాశాలల పని వేళలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పెంచామన్నారు. దీనికితోడు అంతర్గత పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ఫలితాలు ఆధారంగా అధ్యాపకుల పని తీరు విశ్లేషించి తగిన చర్యలు తీసుకున్నారన్నారు. పేరెంట్ టీచర్ సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చినట్లు చెప్పారు. టేక్ కేర్ వ్యవస్థను ఏర్పాటుచేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలు, అటెండెన్స్ బాధ్యతలను అప్పగించామన్నారు. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగినట్లు తెలిపారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - బండి ఆత్మ కూర్, తగరపువలస

పరీక్షల్లో ఫెయిల్ అయ్యామన్న మనస్తాపంలో ఇద్దరూ ఇంటర్ విద్యార్థులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండల కేంద్రంలో జూనియర్ ఇంటర్ విద్యార్థి చిన్న మస్తాన్(16) బండి ఆత్మకూరు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విశాఖప్నటం ఒకటో వార్డు పరిధి కొండపేటకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి గుండు చరణ్ తేజ్ (18) సంగివలసలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఫిజిక్స్ సబ్జెక్ట్ తప్పడంతో మనస్తాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదరగొట్టిన అభిషేక్

- 55బంతుల్లో 141పరుగులు
- పంజాబ్ కింగ్స్‌పై 247 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన సన్‌రైజర్స్

హైదరాబాద్: రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 247 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఛేదన. తొలుత శ్రేయస్(82), ప్రభ్‌సిమ్రన్(42) ప్రియాన్ష(36) రాణించడంతో పంజాబ్ కింగ్స్ 245పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 18.3ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ సెంచరీకి తోడు హెడ్(66) రాణించి తొలి వికెట్‌కు 12.2ఓవర్లలో 171పరుగుల పునాది వేశారు. ఆ తర్వాత అభిషేక్ శర్మ సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించాడు. కేవలం 55బంతుల్లో 14ఫోర్లు, 10భారీ సిక్సర్ల సాయంతో 141పరుగులు చేసి గెలుపు తీరాలకు చేరాడు. వీరిద్దరు ఔటయ్యాక క్లాసెన్(21నాటౌట్), ఇషాన్(9నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను గెలిపించిన హెడ్-అభిషేక్ శర్మ

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 245పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(82; 36బంతుల్లో 6ఫోర్లు, 6సిక్సర్లు)కి తోడు ప్రభ్‌సిమ్రన్(42) బ్యాటింగ్‌లో రాణించారు. చివరి ఓవర్లో స్టొయినీస్ 27పరుగులు కొట్టి జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. పంజాబ్ కింగ్స్ కేవలం 3 ఓవర్లలోనే 50 పరుగులను కొట్టింది. దీంతో ఈ ఐపిఎల్ సీజన్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన టీమ్‌గా బెంగళూరు సరసన పంజాబ్ నిలిచింది. గతంలో ఆర్సీబీ కూడా ఢిల్లీ క్యాపిటల్స్‌పై కేవలం 18 బంతుల్లోనే అర్ధసెంచరీ కొట్టగా.. 2011లో రాజస్తాన్‌పై 2018లో ఢిల్లీపై పంజాబ్ జట్టు కేవలం17బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసి రికార్డు నెలకొల్పింది. ఇక ప్రస్తుత మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. ఈ ఏడాది సీజన్‌లో ఇదే అత్యధిక పవర్ ప్లే స్కోర్ కావడం గమనార్హం. కాగా ఈ మ్యాచ్‌లో ఆర్య(13 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 36), ప్రభ్ సిమ్రాన్ సింగ్(23 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 42) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి ఔటయ్యారు. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(82) అర్ధసెంచరీకి తోడు చివర్లో స్టొయినీస్(34నాటౌట్; 11బంతుల్లో ఫోర్లు, 4సిక్సర్లు కొట్టి పంజాబ్ జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో హర్షల్ పటేల్‌కు నాలుగు, ఈషన్ మలింగకు రెండు వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష ఆర్యా (సి)నితీశ్‌కుమార్ (బి)హర్షల్ పటేల్ 36, ప్రభ్‌సిమ్రన్ (సి)కమిన్స్ (బి)ఈషన్ మలింగ 42, శ్రేయస్ (సి)హెడ్ (బి)హర్షల్ పటేల్ 82, నేహల్ వధేరా (ఎల్‌బి)ఈషన్ మలింగ 27, షారుక్ ఖాన్ (ఎల్‌బి)హర్షల్ పటేల్ 2, మ్యాక్స్‌వెల్ (బి)హర్షల్ పటేల్ 3, స్టొయినీస్ (నాటౌట్) 34, జాన్సెన్ (నాటౌట్) 5, అదనం 14. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 245పరుగులు.

వికెట్ల పతనం: 1/66, 2/91, 3/164, 4/168, 5/205, 6/206 **బౌలింగ్:** షమీ 4-0-75-0, కమిన్స్ 4-0-40-0, హర్షల్ పటేల్ 4-0-42-4, ఈషన్ మలింగ 4-0-45-2, జీషన్ అన్సారి 4-0-41-0.

సన్‌రైజర్స్ ఇన్నింగ్స్: హెడ్ (సి)మ్యాక్స్‌వెల్ (బి)చాహల్ 66, అభిషేక్ శర్మ (సి)దూబె (బి)అర్ష్‌దీప్ 141, క్లాసెన్ (నాటౌట్) 21, ఇషాన్ కిషన్ (నాటౌట్) 9,

వికెట్ల పతనం: 1/171, 2/222 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-1, జాన్సెన్ 2-0-39-0, యశ్ ఠాకూర్ 2.3-0-40-0, మ్యాక్స్‌వెల్ 4-0-40-0, ఫెర్గుసన్ 0.2-0-1-0, స్టొయినీస్ 0.4-0-5-0, చాహల్ 4-0-56-1, శశాంక్ సింగ్ 2-0-27-0.

ఐపిఎల్‌లో నేడు

రాజస్తాన్ రాయల్స్ × బెంగళూరు
వేదిక: జైపూర్; మ.3.30గం॥లకు

ఢిల్లీ × ముంబయి
వేదిక: ఢిల్లీ; రా.7.30గం॥లకు

గుజరాత్ జోరుకు లక్నో బ్రేక్

- పూరన్, మర్‌క్రమ్ విధ్వంసం
- టైటాన్స్‌పై ఆరు వికెట్లతో గెలుపుతో 3వ స్థానానికి...

లక్నో: ఈ సీజన్ ఐపిఎల్‌లో వరుసగా నాలుగు విజయాలతో దూసుకెళ్తున్న గుజరాత్ టైటాన్స్ జోరుకు లక్నో సూపర్ జెయింట్స్ బ్రేక్ వేసింది. తొలుత గుజరాత్‌ను 180 పరుగులకే కట్టడి చేసిన లక్నో.. ఆ లక్ష్యాన్ని 19.3ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసి గెలిచింది. లక్నో బ్యాటర్లు నికోలస్ పూరన్(61), ఓపెనర్ ఎడెన్ మర్‌క్రమ్(58) అర్ధ సెంచరీలతో రాణించి లక్నో గెలుపులో కీలకపాత్ర పోషించారు. దీంతో లక్నో జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచి 3వ స్థానానికి ఎగబాకింది. ఆఖర్లో గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసినా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బదొని(28 నాటౌట్), డేవిడ్ మిల్లర్(7)లు ఒత్తిడికి లోనవ్వలేదు. 20వ ఓవర్లో బౌండరీ బాదిన బదొని.. ఆ తర్వాత సిక్సర్‌తో జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. దాంతో, ఐదో విక్టరీకిపై కన్నేసిన గుజరాత్‌కు భంగపాటు తప్పలేదు. సొంతగడ్డపై లక్నో సూపర్ జెయింట్స్ పంజా విసిరింది. టేబుల్ టాపర్ అయిన గుజరాత్ టైటన్స్‌ను ఓడించి టాప్-4లోకి దూసుకెళ్లింది. బంతితోనే కాదు ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన లక్నో మొదట ప్రత్యర్థిని 180కే కట్టడి చేసింది. ఛేదనలో ఓపెనర్లు ఎడెన్ మర్క్‌రమ్(58), కెప్టెన్ రిషభ్ పంత్‌ధాటిగా ఆ తర్వాత వచ్చిన నికోలస్ పూరన్(61: 34 బంతుల్లో 1 ఫోర్, 7 సిక్సర్లు) మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మరోవైపు మర్క్‌రమ్ సైతం దూకుడు పెంచి 26 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు.ఈ ఇద్దరి మెరుపులతో లక్నో స్కోర్ 10 ఓవర్లకు 114కు చేరింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మార్‌క్రమ్‌కు దక్కింది.

ఐఎస్ఎల్ విజేత మోహన్ బగాన్

ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సిపై 2-1గోల్స్‌తో గెలుపు

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్) 2025 సీజన్ టైటిల్‌ను మోహన్ బగాన్ జట్టు గెల్చుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సిపై 2-1గోల్స్‌తో విజయం సాధించింది. దీంతో లీగ్ చరిత్రలో తొలిసారి ఐఎస్ఎల్‌లో అరంగేట్రం చేసి టైటిల్ కొట్టిన తొలి జట్టుగా మోహన్ బగాన్ జట్టు నిలిచింది. తొలి రెండు అర్ధభాగాలు ముగిసేసరికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. 49వ ని.లో మోహన్ బగాన్ ఆటగాడు ఆల్బెర్టో రోడ్రిగ్స్ సెల్ఫ్ గోల్ చేయడంతో బెంగళూరు జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది. 72వ ని.లో మోహన్ బగాన్ ఆటగాడు జాసన్ కమ్మింగ్స్ గోల్ కొట్టాడు. అదనపు సమయం 96వ ని.లో జామీ మెక్‌లారెన్ గోల్ కొట్టి మోహన్ బగాన్‌ను విజేతగా నిలిపాడు. గతంలో ఎటికె మోహన్ బగాన్ పేరుతో ఆడిన ఈ జట్టు మూడుసార్లు టైటిల్ విజేతగా నిలిచింది. ఈసారి మోహన్ బగాన్ పేరుతో నేరుగా ఎంట్రీ ఇచ్చి టైటిల్ విజేతగా నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68